గ్రంథాలయాల ద్వారా పుస్తకాలు కొనుగోలు చేయాలి



నవ తెలంగాణ - సిద్దిపేట

రాష్ట్ర, జిల్లా గ్రంథాలయాల ద్వారా రచయితలు రాసిన పుస్తకాలు కొనుగోలు చేయాలని జాతీయ సాహిత్య పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఐతా చంద్రయ్య అన్నారు. సిద్దిపేటలో ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన రచయితలను ప్రభుత్వం ఆదుకోవాలని, తమ రచనల ద్వారా సమాజంలో చైతన్యం తెస్తున్న రచనలు ఎంతో వ్యయప్రయాసాలకు ఓడ్చి ప్రచురించిన పుస్తకాలు ఇంట్లోనే ఉండకుండా లక్షలాది మందికి చేరాలంటే గ్రంథాలయాలు కొనుగోలు చేయాలన్నారు. అందుకు ప్రభుత్వం సహకరించాలని, సమాజంలో ఉన్న రుగ్మతలను రూపుమాపడానికి సాహిత్యం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో జసాప అధ్యక్షులు ఎన్నవెల్లి రాజమౌళి, ప్రధాన కార్యదర్శి ఉండ్రాళ్ళ రాజేశం, యువకవి బస్వ రాజ్ కుమార్, చీకోటి రాములు తదితరులు పాల్గొన్నారు.

గీతంకు సీఎస్ఐఆర్ పరిశోధనా ప్రాజెక్టు



నవ తెలంగాణ-పటాన్‌చెరు

భారత ప్రభుత్వ రంగ సంస్థ అయిన సీఎస్ఐఆర్ గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి రూ.25.42 లక్షల పరిశోధనా గ్రాంటును మంజూరు చేసింది. ఈ విషయాన్ని ఉపకులపతి ప్రొఫెసర్ దయానంద సిద్ధవట్టం మంగళవారం వెల్లడించారు. యాస్పైర్ పథకం కింద మంజూరు చేసిన ఈ ప్రాజెక్టు ద్వారా కాస్కేడ్ ఉత్ప్రేరకము ద్వారా సహాయ ఎంజైమ్ పునరుత్పత్తితో సమన్వయ ఫోటో-బయోక్యాటలిటిక్ హైడ్రోజన్ ఉత్పత్తి కోసం పరిశోధన చేపట్టనున్నట్టు ఆయన తెలిపారు. హైదరాబాద్ ప్రాంగణంలోని స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ గౌసియా బేగం ఈ ప్రాజెక్టుకు ప్రధాన పరిశోధకురాలిగా వ్యవహరిస్తారన్నారు. సీఎస్ఐఆర్ ప్రాజెక్టును సాధించిన డాక్టర్ గౌసియా బేగంను ఆయన అభినందిస్తూనే, పరిశోధన ప్రయత్నం ప్రాముఖ్యతను ఎత్తిచూపారు. ఈ ప్రాజెక్టు జ్ఞానాన్ని పెంపొందించడానికి, క్లిష్టమైన రంగాలలో పరిశోధన నైపుణ్యాన్ని ప్రోత్సహించడంలో గీతం అంకితభావాన్ని నొక్కి చెబుతుందని పేర్కొన్నారు.

విత్తనం... తిప్పలు

- జోగిపేటలో జీలుగ, జనుము విత్తనాల కోసం క్యూ లైన్
- కొల్చారంలో పోలీసుల పహారాలో విత్తనాల పంపిణీ
- రైతు అవసరాలకు సరిపడ రాని విత్తనాలు
- ఎరువుల కోసమూ తిప్పలేనా..ముందస్తు కొనుగోళ్లు
- సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో రైతుల తిప్పలు

రకం	సంగారెడ్డి (సాగు విస్తీర్ణం ఎకరాల్లో)	మెదక్ (సాగు విస్తీర్ణం ఎకరాల్లో)	సంగారెడ్డి (అవసరమైన విత్తనాలు క్వింటాళ్లలో)	మెదక్ (అవసరమైన విత్తనాలు క్వింటాళ్లలో)
వరి	150000	360500	33958	78500
పత్తి	360400	40619	7 లక్షల ప్యాకెట్లు	80 వేల ప్యాకెట్లు
కంది	79500	1125	67185	123
మొక్కజొన్న	14200	2820	10985	720
పెసర	9800	1027	7020	145
మినుములు	6300	383	4455	350
చెరకు	25000	109	--	--

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

తొలకరి చినుకు పడిందో లేదో అన్నదాతలు సాగుకు సన్నద్ధమయ్యారు. విత్తనాలు, ఎరువుల్ని సమకూర్చే పనిలో పడ్డారు. ఒక పక్క వేసవి దుక్కులు దున్నుతునే సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువుల్ని సమకూర్చుకుంటున్నారు. ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగు విస్తీర్ణంపై అంచనాలు సిద్దం చేసిన వ్యవసాయ శాఖ అందుకు సరిపడ విత్తనాలు, ఎరువుల్ని కూడా అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేసింది. పచ్చిరొట్ట ఎరువుగా ఉపయోగపడే జీలుగ, జనుము విత్తనాల కోసం రైతులు ఎగబడుతున్నారు. రైతుల అవసరాల మేరకు మార్కెట్‌లో విత్తనాలు లభించకపోయే సరికి ఇబ్బందులేర్పడుతున్నాయి. సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ఇప్పటికే పలు చోట్ల రైతులు విత్తనాల కోసం ఎగబడుతున్నారు. రైతులకు సరిపడ విత్తనాలు రాకపోవడంతో పోలీస్ పహారా పెట్టి విక్రయించాల్సి వస్తుంది. క్యూ లైన్‌లో పట్టాదారు పాసుపుస్తకాలు పెట్టి పడిగాపులు కాస్తున్నారు. సీజన్ ఆరంభంలోనే విత్తనాలు, ఎరువుల కోసం రైతులు ఎగబడే పరిస్థితి ఏర్పడింది. ఇక జూన్‌లో వర్షాలు సంవృద్ధిగా కురిస్తే అప్పటి పరిస్థితి మరింత దయనీయంగా మారుతుందని పలువురు రైతులు పేర్కొంటున్నారు.

వివిధ పంటల సాగు ఇలా...

ఖరీఫ్ సీజన్‌లో వివిధ రకాల పంటల సాగు విస్తీర్ణం గతేడాది కంటే పెరగనుంది. సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ఈ ఏడాది ఏఏ పంటలు ఎన్ని ఎకరాల్లో సాగయ్యే అవకాశముందో వ్యవసాయ శాఖలు అంచనా వేశాయి. సంగారెడ్డి జిల్లాల్లో వివిధ రకాల పంటలు కలిపి 724405 ఎకరాల్లో సాగవుతాయని అంచాన వేశారు. ఇందులో పత్తి 3.60 లక్షల ఎకరాల్లో వరి 1.50 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న 14200 ఎకరాల్లో సోయాబీన్ 77600 ఎకరాల్లో కంది 79500 ఎకరాల్లో మినుములు 6300 ఎకరాల్లో పెసర్లు 9800 ఎకరాల్లో చెరకు 25000 ఎకరాల్లో సాగుతాయని అంచనా వేశారు. వీటితో పాటు ఉల్లి, ఆలుగడ్డ, జొన్న, జీలుగు, జనుము వంటి పంటలు కూడా సాగవనున్నాయి. మెదక్ జిల్లాల్లో వివిద రకాల పంటలు కలిపి 379509 ఎకరాల్లో సాగవుతాయని అంచనా వేశారు. ఇందులో వరి అత్యధికంగా సాగవనుంది. ఈ ఏడాదిలో 327113 ఎకరాల్లో వరి పంట సాగవనుంది. పత్తి అతి తక్కువగా కేవలం 40619 ఎకరాల్లోనే సాగవనుంది. మొక్కజొన్న 2820 ఎకరాల్లో కందులు 1125 ఎకరాల్లో మినుములు 383 ఎకరాల్లో చెరకు 109 ఎకరాల్లో పెసర 1027 ఎకరాల్లో సాగవనున్నాయి. జీలుగ, జనుము ఇతర పంటలు కూడా సాగవనున్నాయి.



అవసరమైన విత్తనాలు

ఈ ఏడాది వివిద పంటల సాగు విస్తీర్ణాన్ని బట్టి ఏఏ రకాల విత్తనాలు ఎన్నిక క్వింటాళ్లు కావాల్సి ఉందో వ్యవసాయ శాఖ అంచనా వేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ఈ మేరకు వివిద పంటలకు సంబంధించిన విత్తనాల్ని రైతులకు అందుబాటులో ఉంచి పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. సంగారెడ్డి జిల్లాలో వరి విత్తనాలు 33958 క్వింటాళ్లు, కంది 67185 క్వింటాళ్లు, మొక్కజొన్న 10985 క్వింటాళ్లు, సోయాబీన్ 58085 క్వింటాళ్లు, మినుము 4455 క్వింటాళ్లు, పెసర్లు 7020 క్వింటాళ్ల విత్తనాలు అవసరముంది. అదే విధంగా పత్తి సాగు కోసం ఎకరాలకు రెండు ప్యాకెట్ల చొప్పున మొత్తం జిల్లాకు 7 లక్షల విత్తన ప్యాకెట్లు కావాలి. మెదక్ జిల్లాలో వరి విత్తనాలు 78500 క్వింటాళ్లు, కంది విత్తనాలు 123 క్వింటాళ్లు, మొక్కజొన్న 720 క్వింటాళ్లు, జొన్న 238 క్వింటాళ్లు, పెసర 145 క్వింటాళ్లు, పత్తి సాగు కోసం 80 వేల ప్యాకెట్ల విత్తఆనలు అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేసినట్లు వ్యవసాయ శాఖ వెల్లడించింది.

విత్తనాల కోసం పడిగాపులు

వ్యవసాయ సీజన్ ప్రారంభం అయ్యిందో లేదో రైతులు విత్తనాల కోసం పడిగాపులు కాయాల్సి వస్తుంది. సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో అప్పుడే విత్తనాలు, ఎరువుల కోసం రైతులు దుకాణాల వద్ద క్యూ లైన్‌లో ఉండాల్సి వస్తుంది. ముఖ్యంగా ఖరీఫ్ సాగుకు ముందస్తుగా జీలుగ, జనుము సాగు చేస్తారు. ఇటీవల రెండు జిల్లాల్లోనూ వర్షాలు కురిశాయి. అదే విధంగా సింగూరు జలాలు అందుబాటులో ఉన్నాయి. దీంతో ఖరీఫ్ పంటల సాగుకు సన్నద్ధమయ్యారు. సంగారెడ్డి జిల్లాలోని అందోల్ నియోజకవర్గ కేంద్రమైన జోగిపేట పట్టణంలో రైతులు జీలుగ, జనుము విత్తనాల కోసం రైతులు క్యూలో నిల్చుండాల్సి వచ్చింది. మండుటెండలు కాస్తుండడంతో క్యూలో నిలబడలేక సీరియల్ కోసం విత్తనాల దుకాణాల ముందు పట్టాదారు పాసుపుస్తకాల్ని క్యూలైన్‌లో పెట్టారు. 138 క్వింటాళ్ల జీలుగ, 40 క్వింటాళ్ల జనుము విత్తనాలు వచ్చాయి. వాటిని రైతులకు తొలిదశలోనే పంపిణీ చేశారు. అందుబాటులో ఉన్న విత్తనాల కంటే రైతుల అవసరాలు అధికంగా ఉండడంతో విత్తనాల కోసం ఎగబడాల్సి వస్తుంది. మెదక్ జిల్లాలోని చిలిపిచెడ్ మండల కేంద్రంలోనూ జీలుగ, జనుము ఇతర విత్తనాల కోసం రైతులు ఎగబడ్డారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకుని పహారా పెట్టారు. రైతులు ఎగబడి గొడవ పడకుండా పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేసి విత్తనాల్ని పంపిణీ చేయాల్సి వచ్చింది. పరిస్థితి ఇలానే కొనసాగితే ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా విత్తనాలు, ఎరువుల కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

సాగుకు సరిపడ విత్తనాలు అందుబాటులో ఉంచాలి

ఎ.మల్లేశం, సీపీఎం జిల్లా కార్యదర్శి మెదక్



ఖరీఫ్ సాగుకు సరిపడ విత్తనాల్ని అందుబాటులో ఉంచి రైతులకు అందేలా చూడాలి. ఇప్పటికే వర్షాలు కురుస్తున్నాయి. నైరుతీరుతు పవనాలు సకాలంలో వస్తే ఖరీఫ్ సీజన్‌లో అంచనాకు మించి పంటలు సాగయ్యే అవకాశముంది. ప్రభుత్వం సాగు విస్తీర్ణం మేరకు విత్తనాల్ని రైతులకు అందజేయాలి. సీజన్ ప్రారంభంలోనే రైతులు జీలుగ, జనుము వంటి విత్తనాల కోసం రోడ్లపైకొచ్చి క్యూలైన్‌లో నిలబడాల్సి రావడం ఇబ్బందికరం. సరిపడ విత్తనాల్ని పంపిణీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. కొల్చారం, నర్సాపూర్, కౌడిపల్లి, నిజాంపేట, చిలిపిచెడ్, మెదక్, రామాయంపేట, పాపన్నపేట, టేక్మాల్, హవేళీఘన్‌పూర్ వంటి ప్రాంతాల్లో విత్తనాల కొరత లేకుండా చూడాలి.

పోలీస్ స్టేషన్ ముందు ఎస్ఐ భార్య ఆందోళన

సిద్దిపేట, కరీంనగర్ సీపీలకు ఫిర్యాదు
తనకు ప్రాణం ఉందంటూ ఆవేదన?



నవతెలంగాణ-కొమురవెల్లి

కొమరవెల్లి పోలీస్ స్టేషన్ ముందు ఎస్ఐ నాగరాజు భార్య మానస ఆందోళన చేపట్టారు. మంగళవారం ఆమె తల్లి, బంధువులు పలువురు మహిళలతో కలిసి తనకు న్యాయం చేయాలంటూ స్టేషన్ ముందు బైఠాయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2014లో పెద్దలు కుదిర్చిన ప్రకారం ఇరువురికి వివాహం జరిగిందని ఇద్దరు కుమారులు పుట్టారని చెప్పారు. మొదట కరీంనగర్‌లో అద్దె ఇంట్లో ఉన్నామని కొమరవెల్లికి ట్రాన్సుర్ అయి వచ్చి నప్పటి నుంచి ఒక్కసారి కూడా ఇక్కడికి తీసుకు రాలేదని తెలిపారు. తన భర్త మరో వివాహం చేసుకున్నాడని ఆరోపించింది. ఇటీవల తన పిల్లలను కూడా అతనే పెంచుకుంటున్నాడని తెలిపారు. ఇదే విషయమై నిలదీస్తే పలుమార్లు కొట్టాడని కాపురానికి తీసుకు వెళ్లకుండా కొమురవెల్లిలో మరో కాపురం పెట్టాడని తెలిసి ఇక్కడికి వచ్చి నిరసన చేపట్టామన్నారు. ఇటీవలే న్యాయం చేయాలంటూ సిద్దిపేట, కరీంనగర్ సిపిలను కలిసి విషయం చెప్పినా ఎవరు పట్టించుకోవడంలేదని, తనకు ఎస్ఐ నాగరాజుతో ప్రాణభయం ఉందని తెలిప్లారు. ఎక్కడ న్యాయం జరగకపోవడంతోనే పోలీస్ స్టేషన్ ముందు ఆందోళన చేపట్టామని, తగిన న్యాయం చేయాలంటూ ఉన్నతాధికారులను వేడుకొన్నారు. ఎస్ఐ నాగరాజు వారం రోజుల పాటు సెలవు పెట్టినట్టు సమాచారం. ఈ విషయంపై వివరణ కోసం 'నవతెలంగాణ' ఫోన్ చేయగా స్పందించలేదు.

భద్రత సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలి

స్ట్రాంగ్ రూమ్‌లో ఉన్న ఈవీఎంలపై ప్రత్యేక నిఘా ఉంచాలి
స్ట్రాంగ్ రూమ్‌ల భద్రత పరిశీలన
జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఆర్ఓ
జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ క్రాంతి వల్లూరు



నవతెలంగాణ-పటాన్‌చెరు

ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ వద్ద ఉన్న భద్రతా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఆర్ఓ, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు తెలిపారు. మంగళవారం పటాన్‌చెరు సమీపంలోని రుద్రారం గీతం యూనివర్సిటీ కళాశాలలో, స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచిన నారాయణఖేడ్, అందోల్, జహీరాబాద్, ఎల్లారెడ్డి, కామారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ అసెంబ్లీ సెగ్మెంట్‌లకు సంబంధించిన ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పోలీస్ భద్రతను, సీసీ కెమెరాల పనితీరును, కంట్రోల్ రూమ్ రికార్డులను, పోలీస్ సిబ్బంది విధుల నిర్వహణను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రత కట్టుదిట్టంగా ఉండాలని, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నిమ్జ్ ప్రత్యేకాధికారి రవీంధర్ రెడ్డి, సర్వేయర్ కోటేశ్వరావు, ఎఆర్ఓ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ధరణి పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించాలి

దాన్యం కొనుగోళ్లు వేగం చేయాలి
కలెక్టర్ క్రాంతి వల్లూరు

నవతెలంగాణ-సంగారెడ్డి



పెండింగ్ ధరణి దరఖాస్తుల పరిశీలన వేగవంతం పరిష్కరించాలని, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అధికారులను ఆదేశించారు. రెవిన్యూ, పౌర సరఫరా శాఖల అధికారులు, డిఆర్‌డిఓ అధికారులతో మంగళవారం సాయంత్రం టెలీకాన్ఫెరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దరఖాస్తుల పరిశీలనపై రెవెన్యూ అధికారులతో మాట్లాడారు. ధరణి పోర్టల్ పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను గడువు లోపల పరిష్కరించాలన్నారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి అవసరమైతే ఫీల్డ్ ఇన్స్పెక్షన్ చేసి ఆన్లైన్‌లోనే కాకుండా ఫైల్స్ రూపంలో కూడా నిర్వహించాలని తహసీల్దార్లను ఆదేశించారు. రిపోర్టులను పరిశీలించి సంబంధిత నివేదికలతో పూర్తిస్థాయిలో కలెక్టరేట్‌కు సమర్పించాలన్నారు. పెండింగ్ సమస్యలు పరిష్కరించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని, చాల బాధ్యతతోపాటు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ధరణి దరఖస్తులను అందుబాటులో ఉన్న రికార్డుల ద్వారా పరిశీలించి పూర్తి చేయాలన్నారు. మాడ్యూల వారీగా ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని, ప్రతి దరఖాస్తును పరిష్కరించేలా చర్యలు చేపట్టాల్సి ఉంటుందని తెలిపారు.

ధాన్యం సేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలి

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. మంగళవారం అందోల్ డివిజన్లలోని మాన్ సాన్ పల్లి, కంసాన్ పల్లి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు పరిశీలించడం జరిగిందని, కొన్ని సెంటర్ లలో మాయిశ్చర్ వచ్చినా కూడా ఎందుకు తూకం వేయడం లేదని, అధికారులను ప్రశ్నించారు. మాయిశ్చర్ వచ్చిన ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. అందోల్ మండలం అన్నారం, జిన్నారం ఐకేపీ, పుల్కకల్ కల్వేర్ పి ఏ సి ఎస్, డి సి ఎం ఎస్ లలో పెండింగ్ వున్నా ధాన్యం సేకరణ పూర్తి చేయాలి. అవసరమైన నన్ని లారీలు ఏర్పాటు చేసి ధాన్యం సేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రలకు ధాన్యం తెచ్చిన రైతులకు టోకెన్ వారీగా ధాన్యం కాంటా వేయాలని, రైతులు నుండి ఎటువంటి పిర్యాదులు రాకూడదన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు పరిష్కరించాలని అన్నారు. కేంద్రాల వద్ద సరిపడా సంఖ్యలో హమాలీలు సేవలందించేలా ఏర్పాట్లు ఉండాలని, రైస్ మిల్లుల వద్ద కూడా ధాన్యం లోడ్‌లతో కూడిన లారీలు నిలిచి ఉండకుండా ఎప్పటికప్పుడు ధాన్యం నిల్వలను దిగుమతి చేసుకునేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలన్నారు. కొనుగోలు కేంద్రాలలో సరిపడా టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేంద్రాలలో రైతులకు అవసరమైన అన్ని సదుపాయాలూ ఏర్పాటు చేయాలనీ పేర్కొన్నారు.

వ్యవసాయ దినసరి కూలీ బిడ్డకు డాక్టరేట్

- ప్రపంచ మానవ హక్కుల పరిరక్షణ కమిషన్ నుంచి తోర్నాల్ డిగ్గే బాబుకు దాక్టరేట్ ప్రధానం



నవతెలంగాణ-నారాయణఖేడ్ రూరల్

నారాయణఖేడ్ నియోజకవర్గంలోని తోర్నాల గ్రామానికి చెందిన డిగ్గే గుండమ్మ వ్యవసాయ కూలీగా పని చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొచ్చేది. రెక్కాడితేగాని డొక్కాడని పరిస్థితి. ఆ కుటుంబం ఉండేది రేకుల గుడిసెలో... ఆ కుటుంబం నుంచి డిగ్గే బాబు డిగ్రీ వరకు చదువుకున్నాడు. కుటుంబానికి చేదోడువాదోడుగా అమ్మకు అండగా సహాయం చేస్తూ... ఆర్థిక ఇబ్బందులు అనేకం ఉన్నా వాటిని లెక్క చేయకుండా గ్రాడ్యుయేషన్ డి.ఎడ్ పూర్తి చేయడం ఆ తరువాత వ్యాపారం చేసుకొంటూ..కులాంతర వివాహం చేసుకున్నారు. కుల దురాహంకారంతో పలువురు తనపై సూటిబోటి మాటలు అన్నా పట్టించుకోలేదు. కుల వివక్ష చాలా విపరీతంగా ఉండే ప్రాంతం వాళ్ళది.. సమాన అవకాశాలు సమానత్వం స్వేచ్ఛ ఇలాంటి మానవ హక్కులు ఉండాలి అనే ఉద్దేశంతో... సమాజానికి సేవ చేయాలనే దృక్పథంతో... ప్రపంచ మానవ హక్కుల సంస్థలో జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైనాడు.. మానవుల హక్కులకు ఎక్కడ భంగం కలిగినా వాళ్ళ కోసం నిరంతరం పనిచేయడం ప్రారంభించడం మొదలుపెట్టాడు. న్యాల్‌కల్ మండలం ఖలీల్ పూర్ గ్రామంలో శివ అనే వ్యక్తిని గ్రామంలో కొందరు ఒక్కడిని కొట్టడంతో అక్కడికి వెళ్లి అండగా నిలబడ్డారు. సమస్యను పరిష్కరించారు. ఇలాంటి ఎన్నో ఘటనలో పరిష్కారం అయ్యే విధంగా పనిచేయడం అక్కడికి వెళ్లి మానవ హక్కులు ఉంటాయి అని చైతన్యం చేసి హక్కుల కోసం బాధిత కుటుంబానికి అండగా నిలబడడం జరిగింది. 2020 నుండి 2021 వరకు కరోనా వచ్చిన సందర్భంగా ప్రజలకు పండ్లు, కూరగాయలు, రక్త దానం చేశారు. మానవ హక్కుల గురించి ఊరురా చైతన్యం కల్పించారు. ఈ సేవల కార్యక్రమాలను గుర్తించి ప్రపంచ మానవ హక్కుల పరిరక్షణ కమిషన్ ద్వారా... కమిషన్ చైర్మన్ తపన్ కుమార్ రౌటారి ఆధ్వర్యంలో బాబుకు డాక్టరేట్ ప్రధానం చేయడం జరిగింది. తనకు మానవ హక్కుల పైన అవగాహన కల్పించి ఎంతగానో ప్రోత్సహించి, తనలో ధైర్యాన్ని నింపి ప్రతి కష్టాల్లో నేనున్నానంటూ తనకు ఎంతగానో తోడ్పడిన టీజీ ప్రెసిడెంట్ నవోదయ సిద్దుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

మామిడి రకాల ప్రదర్శన ప్రారంభం



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

సంగారెడ్డిలోని ఫల పరిశోధన కేంద్రంలో మంగళవారం మామిడి రకాల ప్రదర్శన కార్యక్రమాన్ని శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ నీరజ ప్రభాకర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పరిశోధన సంచాలకులు డాక్టర్ కిరణ్ కుమార్, ఫల పరిశోధన సంస్థ - సంగారెడ్డి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుచిత్ర, జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి పి సోమేశ్వర రావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో 260 కి పైగా మామిడి రకాలను ప్రదర్శనకి ఉంచారు. ఫల పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త అయిన సుచిత్ర మాట్లాడుతూ హస్తబలి అని పిలువబడే గుర్రపు తాన 477 రకాల మామిడి జన్యు సంపత్తికి ఎలా నిలయమైందో వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసినటువంటి శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ నీరజ ప్రభాకర్ రైతులను ఉద్దేశించి మామిడి మొక్కల ఎంపిక, యాజమాన్యం, మామిడి ఎగుమతికి సంబంధించిన వివరాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి రైతులు విచ్చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా తేర్పోల్ గ్రామం కొండాపూర్ మండలానికి సంబంధించిన మామిడి రైతు నరసింహారెడ్డి తమ అనుభవాలను అందరితో పంచుకున్నారు. ఈ కార్యక్రమం బుధవారం కూడా వీక్షకులకు అందుబాటులో ఉంటుంది. ఈ అవకాశాన్ని ఆసక్తి గల ప్రజలు, రైతులు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ జిల్లా అధికారి శ్రీధర్, ఉద్యాన శాఖ అధికారులు బి శైలజ, పి శైలజ, సమత, స్పందన కీర్తి కృష్ణ, ఫల పరిశోధన స్థానం సంగారెడ్డి లోని శాస్త్రవేత్తలు డాక్టర్ హరికాంత్ డాక్టర్ మాధవి, డాక్టర్ మౌనిక, డాక్టర్ నితీష్ కుమార్ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు..

టేకులకుంటను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మార్వోకు వినతి

నవతెలంగాణ-జిన్నారం



జిన్నారం మండల పరిధిలోని ఊట్ల శివారులో గల టేకులకుంట కట్టను కూల్చివేసిన వారిపై వెంటనే చర్యలు చేపట్టాలని ఊట్ల గ్రామస్తులు, మత్స్య సంఘం ప్రతినిధి బృందం డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జిన్నారం మండల తహశీల్దార్ బిక్షపతికి వారు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కిందట కూలీలు టేకులకుంట కట్ట పని చేపట్టారని ఉపాధి హామీ పథకం కూలి డబ్బులు రాకముందే కొందరు దుండగులు కట్టను కూల్చివేయడం హేయనీయమైన చర్య అని సదరు వ్యక్తులపై వెంటనే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. టేకులకుంట ధ్వంసం కావడం ఇటు మత్స్యకారులకు అటు గ్రామస్తులకు ఇబ్బందికరంగా మారిందన్నారు. టేకులకుంట కట్ట ధ్వంసం చేసిన అంశమై జిల్లా ఇరిగేషన్ అధికారులకు విన్నవించగా స్థానిక ఇరిగేషన్ ఏఈ సమాచారం ఇవ్వకుండా వచ్చినట్టే వచ్చి ముక్కుబడిగా విచారణ చేపట్టారని మచ్చ సంఘం ప్రతినిధి మహేష్ ఆరోపించారు. మత్స్యకారుల ఆవేదన పట్టించుకోరా అంటూ ఇరిగేషన్ ఏఈపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జిన్నారం మండలంలో చాలా కుంటలు నాశనమవుతున్నాయంటూ ఇరిగేషన్ ఏఈని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

విచారణ చేపట్టిన అధికారులు

గ్రామస్తుల ఫిర్యాదు మేరకు టేకులకుంట కట్ట ధ్వంసం అంశంపై ఇరిగేషన్ అసిస్టెంట్ ఇంజనీర్ దిలీప్ కుమార్, జిన్నారం మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ జయప్రకాష్ నారాయణ, సర్వేయర్ రామభద్రం బృందం మంగళవారం విచారణ చేపట్టారు. ఈ అంశంపై ఇరిగేషన్ దిలీప్ కుమార్ మాట్లాడుతూ రికార్డుల ప్రకారం అక్కడ కుంట నోటిఫై కాలేదని, సర్వే మ్యాప్స్ ఆఫ్ ఇండియాలో టేకులకుంట కట్టా అని పేరు లేదని, కాగా గ్రామస్తులు అది కుంట అని అంటున్నారని తెలిపారు. రెవెన్యూ అధికారులతో కలిసి ఆ ప్రాంతం పరిశీలించినట్లు ఏఈ దిలీప్ కుమార్ చెప్పారు. ఆ ప్రాంతానికి సంబంధించి సర్వేనెంబర్ 650లో రెండు ఎకరాల 22 గుంటలు ఆ ప్రాంతంలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. అయితే ఈ విషయమై ఇరిగేషన్ ఉన్నతాధికారులకు రెవెన్యూ అధికారుల మండల పరిషత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు ఏఈ దిలీప్ చెప్పారు. ఆ ప్రాంతంలో కొంత ధ్వంసం జరిగిందన్నారు. నిబంధనల మేరకే పరిశీలన చేసినట్లు ఆయన చెప్పారు. టేకులకుంట కట్ట ధ్వంసం జరిగిన ప్రాంతంగా పేర్కొంటున్న ఈ అంశంలో జాతీయ ఉపాధి హామీ పథకం కిందట ఇటీవల కుంట కట్ట పనులు ఏ మేరకు జరిగాయి, ధ్వంసమైన ప్రాంతం ఎంత మేరకు నష్టం జరిగింది, తదితర అంశాలపై అధికారులు పూర్తి వివరాలు సేకరించి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఊట్ల గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన అధికారులకు షోకాజ్ నోటీసులు

జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

నవతెలంగాణ-సంగారెడ్డి



అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమం పనుల పురోగతి సరిగా లేనందున, విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన కారణంగా హెచ్ఎంలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలనీ జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారికి ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. మంగళవారం అందోల్ డివిజన్‌లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన కనీస మౌలిక వసతుల కల్పన అభివృద్ధి పనులు, సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన మౌలిక వసతుల కల్పన అభివృద్ధి పనులు దగ్గర వుండి చేయించుకునే భాద్యత ప్రధాన ఉపాధ్యాయులదేనన్నారు. తనిఖీలు చేసిన పాఠశాలలలో ఉపాధ్యాయులు లేకపోవడంతో అసహనం వ్యక్తంచేశారు. వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలనీ జిల్లా విద్యాధికారికి ఆదేశించారు. పాఠశాలల పునః ప్రారంభం నాటికీ అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనులను తప్పనిసరిగా పూర్తి చేసి నివేదికలు సమర్పించాలని విద్యా శాఖ అధికారులను, ఈఈపిఆర్ ఇంజనీర్లను ఆదేశించారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో బాలికల విద్యార్థులకు సంఖ్య ప్రకారం తప్పనిసరిగా ప్రత్యేకంగా టాయిలెట్లు ఉండాలని, వీటిని అత్యంత ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలన్నారు. పాఠశాలల పునః ప్రారంభానికి ముందే ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా చేపట్టిన కనీస మౌలిక వసతుల కల్పన పనులు పూర్తి చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, ఈ ఈపిఆర్ అంజయ్య, ఆర్డిఓ పాండు, ఏం ఇ ఓ కృష్ణయ్య, ఏం పి ఓలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు,

ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

నవ తెలంగాణ -దుబ్బాక /సిద్దిపేట రూరల్



ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని,వచ్చే పది రోజుల్లో రైతుల నుండి మొత్తం వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేక అధికారిని భారతి హెూలీకేరి అధికారులను ఆదేశించారు. మంగళవారం దుబ్బాక మండల పరిధిలోని హబ్సిపూర్ లో ఐకెపి కేంద్రాన్ని సిద్దిపేట రూరల్ మండలం పరిధిలోని ఇరుకోడు ఐకెపి కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఎం.మను చౌదరి తో కలిసి ఆమె సందర్శించారు.కొనుగోలు కేంద్రాల్లో ఉన్న సమస్యలపై అక్కడి రైతులను ఆరా తీశారు.జిల్లాలో ఇప్పటివరకు 50,953 మంది రైతుల నుండి 2,23,198 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందన్నారు. రైతుల ఖాతాల్లో రూ.491 కోట్ల గాను ఇప్పటివరకు రూ.409 కోట్లు జమ చేయడం జరిగిందన్నారు.వారి వెంట అదనపు కలెక్టర్ (రెవిన్యూ) శ్రీనివాస్ రెడ్డి,జిల్లా పౌరసరఫరాల అధికారి తనూజ, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ హరీష్,డీఆర్డిఓ జయదేవ్,జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు,జిల్లా వ్యవసాయ అధికారి శివ ప్రసాద్,జిల్లా రవాణా అధికారి వేణు,లీగల్ మెట్రాలజీ అధికారి,రైస్ మిల్లర్లు,ఆయా శాఖల సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

సాధన డిగ్రీ కళాశాలలో చేతిరాతపై శిక్షణ

కరస్పాండెంట్ నాయిని రాజగోపాల్

నవతెలంగాణ - చేగుంట



పరీక్షల్లో చేతి రాత బాగుంటే మార్కులు ఎక్కువగా సాధించ వచ్చుని శ్రీ సాధన డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ నాయిని రాజగోపాల్ అన్నారు. చేగుంట పట్టణ కేంద్రం శ్రీ సాధన డిగ్రీ కళాశాలలో చేతి రాత నైపుణ్య శిక్షణ శిబిరం నిర్వహించారు. ఇందులో ఉత్తీర్ణులైన విద్యార్థిని విద్యార్థులకు మంగళవారం రాజగోపాల్ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. గత నెల 25వ తేదీ నుండి ఈ నెల 10వ తేదీ వరకు కళాశాలలో చేతిరాత శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో నాలుగు గ్రామాల నుండి 30 మంది విద్యార్థులు పాల్గొని తెలుగు, ఇంగ్లీష్, అంకెల చేతి రాత శిక్షణను పొందారు. హైదరాబాదు నుంచి ప్రముఖ చేతిరాత నిపుణులు(కాలిగ్రఫీ) శ్రీనివాస్ శిక్షణ అందించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్చార్జి నిరోషా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నవతెలంగాణ హత్నూర

హత్నూర మండలం తుర్కల ఖానాపూర్ జిల్లా ప్రాథమిక ప్రభుత్వ పాఠశాల పదవ తరగతి 1997 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. మంగళవారం మండలంలోని శ్రీ వలుగు మీది పోచమ్మ ఆలయం వద్ద వనభోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేటు, ప్రభుత్వం రంగాలలో పని చేస్తూ ప్రతి సంవత్సరం మే 21వ తేదీన ఒక పండుగగా భావించి కలుసుకుంటూ ఉంటామని అన్నారు. ఈ సమ్మేళనంలో పాల్గొని ఒకరికొకరం సుఖదుఃఖాలు తెలుసుకొని సహాయసహకారాలు అందించుకోవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయులు, నాగేశ్వరరావు, భాస్కర్, గణేష్, నిర్మల, వీరమని, లక్ష్మి, బిక్షపతి, మాణిక్యం, విష్ణు, మల్లేశం, రమేష్, ప్రసాద్ తదితరులు పూర్వ విద్యార్థులు ఉన్నారు.

రాజీవ్ గాంధీకి ఘన నివాళులు



నవతెలంగాణ-నారాయణఖేడ్ రూరల్

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ పట్లోల సంజీవరెడ్డి స్వగృహంలో రాజీవ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీనియర్ కాంగ్రెస్ నాయకులు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోజి రెడ్డి మాట్లాడుతూ... ఐటీ రంగానికి పునాది వేసిన మార్గదర్శి రాజీవ్‌గాంధీ అని, భారతదేశానికి ప్రభుత్వ రంగ సంస్థలను ఏర్పాటు చేయడంలో ముఖ్యపాత్ర పోషించారని అన్నారు ఈ కార్యక్రమంలో శంకర్ సేట్ మున్సిపల్ వైస్ చైర్మన్, ఎంపీపీ తనయుడు రమేష్ చౌహన్, పండరి రెడ్డి, రాంచేందర్ మాజీ ఎంపీటీసీ లు, అంజిరెడ్డి ఫ్యాక్స్ వైస్ చేర్మెన్, శంకర్ ముదిరాజ్ తాలూకా సంగం అధ్యక్షులు, హన్మడ్లు కౌన్సిలర్, ఈశ్వరప్ప, విఠల్ రావ్ పాటిల్ మాజీ సర్పంచ్ లు, రాజు సెట్, మారుతి రావు సుబ్బుర్, బసవరాజ్.దత్తు సంగ్రామ్. అంజిరెడ్డి, సాయిరెడ్డి, జైపాల్ నాయక్, బి రాజు యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు, శివరాజ్,శివాజి పాటిల్, అశోక్ డీలర్, బాలకష్ణ, జైపాల్ రెడ్డి, బాబు, నర్సిములు, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణం పూర్తి అయ్యేదెన్నడో...



నవతెలంగాణ - మనూర్

నాగల్గిద్ద మండలంలోని మోర్గి వద్ద వంతెన నిర్మాణం పనులు ఆగిపోయాయి. 3సంవత్సరాల క్రితం రోడ్డు పనులు చేసిన కాంట్రాక్టర్ పిల్లర్ వేసి వదిలివేశారు. వర్షం పడితే రోడ్డు బురద మయం అవుతుంది. దీంతోవాహనాలు రాకపోకలు నిలిచి పోతున్నాయి. పరిసర గ్రామాల ప్రజలు నారాయణ ఖేడ్ బీదర్ వెళ్ళేవారికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండు సంవత్సరాలు క్రితం నిలిచిన పనులు ఇప్పటి వరకు అలానే ఉన్నాయి. వర్షాకాలం వస్తుందంటే ఈ రోడ్డు పైన వెళ్లాలంటే నరకమేనని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు సంబంధిత పనులు పూర్తి చేసేటట్లు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అనుమానస్పదంగా మహిళ మృతి



నవతెలంగాణ-కొండాపూర్

అనుమానాస్పదంగా మహిళ మతి చెందిన సంఘటన మంగళవారం కొండాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. కథనం ప్రకారం మారేపల్లి గ్రామానికి చెందిన గంజాయి రత్నమ్మ(75)కు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. అందులో 20 సంవత్సరాల క్రితం ఒక కొడుకు,ఒక కూతురు చనిపోయారు. అదే క్రమంలో ఆమె 8 నెలల క్రితం తన పేరు మీద ఉన్న 20 గుంటల భూమిని అమ్మగా వచ్చిన 32 లక్షల రూపాయలను, తన చనిపోయిన కొడుకు వాటాగా భావించి.. తన కూతురికి ఇచ్చింది. ఇట్టి డబ్బులు గురించి మరో కొడుకు సామెల్ తన తల్లి (మతురాలతో) గొడవపడి అడగగా... ఆమె ఆ డబ్బులు కూతురుకు ఇచ్చానని, నీకు ఇవ్వను అని చెప్పగా కొడుకు సామెల్ తరచు గొడవ పడుతూ ఉండేవాడు. ఈ సమయంలోనే ఆమె అనుమానాస్పదంగా చనిపోయింది. ఈ విషయంలో కొండాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ సి.హరి శంకర్ గౌడ్, సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎస్.చంద్రయ్య కేసు దర్యాప్తు చేపట్టారు.

బాధితుడికి ఆర్థిక సహాయం

- కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి 20 వేల ఆర్థిక సహాయం అందజేత



నవతెలంగాణ-ఐడిఏ బొల్లారం

బొల్లారంలో బిల్డింగ్ శ్లాబ్ కూలి దీపాంకర్ దాస్ అనే వ్యక్తి కాలు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. అతనికి ఈఎస్ఐ హాస్పిటల్‌లో చికిత్స జరిపి కాలు తొలగించారు. బొల్లారం బీజేపీ పార్టీ టౌన్ అధ్యక్షుడు కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి మంగళవారం బాధితుని పరామర్శించి 20 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొట్టకూటి కోసం ఒడిశా నుండి బొల్లారంకు వచ్చి ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కాలు పోగుట్టు కోవడం చాలా బాధాకరమన్నారు..పేద ప్రజలకు సేవ చేయడం తన అదృష్టమని ఆయన అన్నారు.

విందుకు హాజరైన ఎంపీ బీబీ పాటిల్



నవతెలంగాణ -జహీరాబాద్

మొగుడంపల్లి మండల జడ్పిటిసి అరుణ మోహన్ రెడ్డి ఏర్పాటు చేసిన విందుకు ఎంపీ బీబీ పాటిల్ హాజరయ్యారు. బుధవారం మొగుడంపల్లి మండలంలోని ఎల్లమ్మ దేవాలయం వద్ద ఏర్పాటుచేసిన విందుకు వివిధ పార్టీల ప్రముఖులతోపాటు ఎంపీ పాటిల్ తన అనుచరులతో హాజరై విందును ఆస్వాదించి అరుణ మోహన్ రెడ్డి దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోవర్ధన్ రెడ్డి, ధిశెట్టి పాటిల్ తో పాటు నియోజకవర్గంలోని వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కంగ్టి గిరిజన గురుకులంలో ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు



నవతెలంగాణ-కంగ్టి

మండలంలోని గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎస్టి కేటగిరిలో ఖాళీల భర్తీ కోసం ఈనెల 23న స్పాట్ అడ్మిషన్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.2023-24 లో పదవ తరగతి పాసైన గిరిజన విద్యార్థులు మాత్రమే అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు 23న ఉదయం10:30 గంటలకు హైదరాబాద్ లోని ప్రాంతీయ సమన్వయ అధికారి కార్యాలయంలో ఒరిజినల్ సర్టిఫికెట్ తో హాజరు కావాలని తెలిపారు. ఏవైనా సందేహాలు ఉంటే 9849328298 సంప్రదించవలసినదిగా కళాశాల ప్రిన్సిపల్ సూచించారు.

జోగిపేటలో రాజీవ్ గాంధీ వర్ధంతి



నవతెలంగాణ-జోగిపేట

భారతరత్న, మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ 33 వ వర్ధంతి వేడుకలు మంగళవారం జోగిపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, కౌన్సిలర్ దుర్గేష్, మాజీ ఎంపిటిసి డిజి. వెంకటేష్, కాంగ్రెస్ నాయకులు పట్లోళ ప్రవీణ్, ప్రదీప్ గౌడ్, రామకృష్ణ, గోహర్ అలీ, అక్బర్, అబ్బాస్, లక్ష్మణ్, అరుణ్, తేజ గౌడ్, నాగరాజు, షంషీర్ బేగ్, రాజు, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

ఎవరికి వారే..

- ఫలితాలపై ధీమాలో నేతలు

నవతెలంగాణ - న్యాల్ కల్

లోక్ సభ ఎన్నికలు ఓటింగ్ ముగిసిన నుండి నాయకులు ప్రశాంతమయ్యారు ఎక్కడ చూసినా ఆయా రాజకీయ పార్టీల నాయకులు ప్రజలు ఎన్నికల్లో కాంగ్రెస్ , బీజేపీ , బీఆర్ఎస్ అభ్యర్థులు గెలుపు ఎవరిదో అంచనాలు వేస్తూ చర్చించుకుంటున్నారు. గెలుపుపై ఆయా పార్టీల్లో నేతలు ఎవరికివారే ధీమాతో ఉన్నారు. కాంగ్రెస్ , బిజెపి పార్టీల అభ్యర్థుల మధ్యనే గెలుపు ఓటమి ఉంటాయని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఉత్కంఠ జూన్ 4 తేదీ వరకు ఉంటుంది. సమయం ఎక్కువగా ఉండడంతో గ్రామాల్లో కార్యకర్తలు గెలుపు పై బెట్టింగ్ పెడుతుండటం గమనార్హం.

నత్త నడకన అమ్మ ఆదర్శ పనులు

- బడుల బాధ్యత స్వయం సహాయక సంఘాలదే
- నేటికీ ప్రారంభం కానీ పనులు
- జూన్ 12 నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశం
- క్షేత్రస్థాయిలో కొనసాగని పనులు
- పట్టించుకోని మండల విద్యాధికారి







నవతెలంగాణ - ఝరాసంగం

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాఠశాలలను బలోపేతం చేయడానికి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. జూన్ 12 కల్లా అన్ని పాఠశాలలో మరమ్మతులు పూర్తి చేసి విద్యార్థులకు మౌలిక సదుపాయలు కల్పించాలని ఆదేశించింది. ఇప్పటికే ఆయా పాఠశాలల్లో గుర్తించిన సమస్యలకు పనులను ప్రారంభించిన వారికి 25 శాతం డబ్బులు అడ్వాన్సుగా చెల్లించినట్లు సమాచారం. చేసే పనుల్లో నాణ్యత తప్పనిసరి చేస్తూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, గ్రామ సమైక్య అధ్యక్షులు కలిసి పాఠశాలల్లో పనులను పర్యవేక్షించనున్నారు. గ్రామ సమైక్య సంఘము ఎవరి ద్వారా పనులు చేయించిన గ్రామ సమైక్య వారికే పనులకు సంబంధించిన డబ్బులు డ్రా చేయాల్సి ఉంటుంది. ఈ పనులను పాఠశాల హెచ్ఎంలు మోనిటరింగ్ చేసి జూన్ 12 నాటికి పనులను పూర్తి చేయాల్సి అవసరం ఉంది. ఇప్పటికే ఆయా పాఠశాలలో దాదాపు పనులు చివరి దశకు వచ్చినట్లు తెలుస్తోంది. మరి కొన్ని గ్రామాలలో నేటికీ అసలు పనులనే ప్రారంభించలేదు.

15 పాఠశాలలు.. 23 పనుల ఎంపిక

మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద పాఠశాలల ఆధునీకరణకు సంబంధించి కాంపౌండ్ వాల్స్, టాయిలెట్స్, కిచెన్ షెడ్స్, విద్యుత్ బోర్డ్ల మరమ్మతులు, ఫ్లోరింగ్, ఫ్యాన్లు, తదితర పనులకు ప్రభుత్వం రూ. 186.60 లక్షలు నిధులను మంజూరు చేసింది.ఇప్పటికే ఆయ పనులకు సంబంధించి 25 శాతం నిధులను ప్రభుత్వం అడ్వాన్సుగా విడుదల చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. కానీ రెండు మూడు గ్రామాల్లో తప్ప మిగిలిన గ్రామాల్లో పనులను అస్సలే ప్రారంభం కాలేదు.దీన్ని బట్టి చూస్తే ఉపాధ్యాయులకు వేసవి సెలవులు రావడం తో క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కోరవడింది అని తెలుస్తోంది.గ్రామ సమైక్య అధ్యక్షులకు, హెచ్ఎం లకు సంబంధించి గ్రామాలలో ఉండే నాయకులతో సఖ్యత కుదరడం లేదని దీంతో పనులు కొనసాగడం లేదని చర్చలు వినిపిస్తున్నాయి. పాఠశాలలు ప్రారంభం కావడానికి ఇంకో 20 రోజులు మాత్రమే గడువు మిగిలింది. గడువు ముగిసే నాటికి ఆ పాఠశాలలో పనులు పూర్తికాకపోవచ్చునే అనుమానాలు విద్యార్థుల తల్లిదండ్రులలో నెలకొంటున్నాయి. మండలంలో కొనసాగే అమ్మ ఆదర్శ పనులను మండల విద్యాధికారి కనీసం ఒక్క రోజైనా పరిశీలించిన దాఖలాలు కనిపించడం లేదు. చేసిన పనులలో గుత్తేదారులు నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నారా లేదా..? పంచాయతీరాజ్ శాఖ ఎస్టిమేషన్ ప్రకారం పనులు కొనసాగుతున్నాయా లేదా? అనేది ఇప్పుడు కూడా ఎవరికి తెలియదు. ప్రభుత్వ సొమ్మును అందిన కాడికి దండుకోవడమే పరమావధిగా మారిందని తెలుస్తుంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు కొనసాగుతున్న పనులను పర్యవేక్షించి నాణ్యత ప్రమాణాలను పాటించే విధంగా పర్యవేక్షించాల్సిన అవసరం ఉంది. ప్రారంభం కానటువంటి పనులను పరిశీలించి త్వరలో ప్రారంభించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇదే విషయమై మండల విద్యాధికారికి ఫోన్ లో వివరణ కోరగా ఆయన అందుబాటులోకి రాలేదు.

పనులు కొనసాగుతున్నాయి

- క్రిష్ణరావు పంచాయతీ రాజ్ ఏ ఈ, ఝరాసంగం

మండలంలో అమ్మ ఆదర్శ పథకం కింద ఎంపిక చేసిన అన్ని పాఠశాలల్లో పనులు కొనసాగుతున్నాయి. చిన్న చిన్న రిపేర్లు ఉన్న పాఠశాలలో ఇంకా ప్రారంభించలేదు.

ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలి

- కొనుగోలు వేగవంతం చేయాలి
- జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి ఆదేశం
- ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన



నవతెలంగాణ -జోగిపేట

వరి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని వెంటనే మిల్లర్లకు తరలించాలని జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి అన్నారు. మంగళవారం అందోల్ మండలంలోని పలు వరి కొనుగోలు కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మిల్లుల వద్ద ధాన్యం త్వరగా అన్ లోడ్ చేయించాలని సివిల్ సప్లై అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా రైతుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. వాతావరణ మార్పులకనుగుణంగా ఉదయమే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని సూచించారు. రోజు ఐదు లారీలకు తక్కువ కాకుండా కొనుగోలు కేంద్రాలకు ఏర్పాటు చేయాలని అధికారుల ను ఆదేశించారు. అకాల వర్షాలు పడుతున్నందున కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. చివరిగింజ వరకు ధాన్యం కొనుగోలు చేయాలని సెంటర్ ఇన్చార్జిస్ కి సూచనలు జారీచేశారు.గన్నీబ్యాగ్ల సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తేవాలని తెలిపారు.మిల్లులకు ఇచ్చిన కెపాసిటీని పూర్తి చేయాలని, రైతుల నుండి కొనుగోళ్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతుల శ్రేయస్సు దృష్టిలో వుంచుకొని మిల్లులలో స్పేస్ పెంచుకొని ధాన్యం లారీలను త్వరగా అన్ లోడ్ చేయించాలని, ఆ వెంటనే ఆన్ లైన్ నమోదు చేయాలని ఆదేశించారు. ఆమె వెంట సివిల్ సప్లయ్ జిల్లా మేనేజరు కొండల్ రావు,జిల్లా పౌర సరఫరాల అధికారి వనజాత, మెప్మా పి డి. గీత, ఆర్డీఓ పాండు, తహసిల్దార్ భాస్కర్ కుమార్, ఏడిఏ అరుణ, ఏవో విజయరత్న, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

దొడ్డు వడ్లకు రూ. 500 బోనస్ ఇవ్వాలి

- తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మాణిక్ డిమాండ్
- ఖేడ్ ఆర్డీఓ అశోక్ చక్రవర్తి కి సిపిఎం నాయకుల వినతి

నవతెలంగాణ-నారాయణఖేడ్ రూరల్

దొడ్డు వడ్లకు రూ.500/- రూపాయలు ఇవ్వాలని, అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని, రైతులను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మాణిక్ డిమాండ్ చేశారు. మంగళవారం నాడు ఆర్డిఓ అశోక్ చక్రవర్తికి సిపిఎం నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అతిమేల మాణిక్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం వడ్లకే బోనస్ రూ.500 రూపాయలు ఇస్తామని ప్రకటించింది. జిల్లాలోని నారాయణఖేడ్ ప్రాంతంలో అత్యధికంగా రైతులు దొడ్డు వడ్లని పండిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే బోనస్ రాదని తెలియడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారని.. ప్రభుత్వం దొడ్డువడ్లకు కూడా బోనస్ రూ.500 ఇవ్వాలని సిపిఎం డిమాండ్ చేస్తుందని అన్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పెద్ద ఎత్తున ధాన్యం తడిసి ముద్దయిందని అన్నారు కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని కొనడం లేదని అన్నారు. అట్టి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయకపోతే రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతారని అన్నారు తడిచిన ధాన్యాన్ని సైతం ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతుల పక్షాన ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.. లిఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రమేష్ సతీష్ అరుణ్ సంతోష్ ప్రశాంత్ అర్జున్ అంబేద్కర్ సంఘం డివిజన్ అధ్యక్షుడు బి కాన్షిరం ఎన్పిఆర్డి జిల్లా అధ్యక్షులు బస్వరాజ్ పాటిల్ నాయకులు విశ్వాస్ తదితరులు పాల్గొన్నారులి.



ఆయన విధులకు వస్తారా !

- బొల్లారంలో మున్సిపల్ కమిషనర్ ఉన్నారా?
- పాలక పక్షానికే వత్తాసు అంటూ విమర్శలు

నవతెలంగాణ -ఐడిఏ బొల్లారం

జిల్లాలో అతి పెద్ద పారిశ్రామిక వాడ,అతి పెద్ద మున్సిపాలిటీ అయిన బొల్లారం కి మున్సిపల్ కమిషనర్ ఉన్నారా? ఉంటే పాలక పక్షానికి వత్తాసు పలుకుతూ తన విధులు విషయంలో తన సబార్డినేటర్లపై ఆధారపడటం ఏంటనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అసలు కమిషనర్ విధులకు ఎప్పుడూ వస్తారో ఎప్పుడు వెళ్తారో తెలియని అయోమయంలో ఉన్నామని స్థానికులు అంటున్నారు. ముఖ్యంగా బొల్లారం లో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి.అక్రమ నిర్మాణాలు వల్ల మున్సిపల్ ప్రభుత్వ ఆదాయానికి భారీ గండిపడుతోంది.మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ స్థలాలు,పార్కులు, క్రీడా మైదానాలు రాత్రి కి రాత్రి అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి.అక్రమ నిర్మాణాలు జరగకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన మున్సిపల్ కమిషనర్ తనకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ స్పందించి మున్సిపల్ కమిషనర్ పై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పత్తి నవ్యకు సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

నవతెలంగాణ -వెల్దుర్తి



మాసాయిపేట మండలం హకీంపేట్ గ్రామానికి చెందిన పత్తి నవ్య కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాదులో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందు తోంది. మంగళవారం నరసాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి ఆధ్వర్యంలో పత్తి నవ్య సర్జరీ నిమిత్తం 2 లక్షల 50 వేల రూపాయల ఎల్‌ఓసి చెక్కును ముఖ్యమంత్రి సహాయనిధి నుండి బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ నాగిరెడ్డి, ఎంపీటీసీ కృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ సిద్దిరాములు గౌడ్, పిఏసిఎస్ డైరెక్టర్ నర్సింలుతో కలిసి కుటుంబ సభ్యులకు అందజేశారు ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ నాగరాజు తోపాటు పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ప్రత్యేక అధికారి

నవతెలంగాణ - నార్సింగి



మండల కేంద్రంలోని ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం జిల్లా స్పెషల్ ఆఫీసర్ భారతి హెలీ కేరి, జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, తూప్రాన్ ఆర్డీవో జయచంద్ర రెడ్డి సందర్శించారు. ధాన్యం కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేసి, పంటను తొందరగా మిల్లులకు తరలించాలని అకాల వర్షాల వల్ల రైతులకు నష్టం వాటిల్లకూడదని తెలిపారు. ఐకేపీ ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు పూర్తి అయ్యిందని, మిల్లులకు తరలించడం మిగిలిందని, అది కూడా వేగంగా జరుగుతుందని ఐకేపీ సిబ్బంది తెలుపగా ప్రత్యేక అధికారి వారిని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో కరీం రెవెన్యూ సిబ్బంది, ఐకెపి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వెంకటరామిరెడ్డి సేవలే గెలిపిస్తాయి

హలవత్ శంకర్ నాయక్

నవతెలంగాణ- కౌడిపల్లి



మెదక్ బిఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి సేవలే ఆయనను గెలిపిస్తాయని బీఆర్ఎస్ యువజన నాయకులు హలావత్ శంకర్ నాయక్ అన్నారు. మంగళవారం శంకర్ నాయక్ విలేకరులతో మాట్లాడుతూ ఒక కలెక్టర్‌గా మంచి పేరు తెచ్చుకున్న వ్యక్తి మారుమూల గ్రామాలలో విద్యార్థుల ఆర్థిక పరిస్థితులు బాగాలేక చదువుల్లో వెనుకబడడంతో అది గమనించిన వెంకట్రామిరెడ్డి 100 కోట్లతో ట్రస్టు ద్వారా నిరుపేద విద్యార్థిని విద్యార్థులను ఆదుకునేందుకు ముందుకు వచ్చారని అన్నారు. గతంలో ఏ నాయకుడు కూడా ఇలాంటి విద్యార్థుల కోసం ట్రస్టులు ఏర్పాటు చేయలేదని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో గత ఆరు నెలల నుండి రైతులకు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయన తెలిపారు. మెదక్ ఎంపీ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో దాదాపు 50 వేల మెజార్టీతో వెంకటరామిరెడ్డి గెలవడం ఖాయమని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. రైతులకు రుణమాఫీ చేయకపోతే బిఆర్ఎస్ పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు ధర్నాలు రాస్తారోకోలు చేయడానికి వెనుకాడబోమన్నారు.

మూఢ నమ్మకాలపై పోలీసుల అవగాహన



నవతెలంగాణ- చిన్న శంకరంపేట

మెదక్ ఎస్పీ ఆదేశాల మేరకు మూఢనమ్మకాలపై పోలీసులు అవగాహన కల్పించారు. మండలంలోని ఎస్ కొండాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని లచ్చిరాం తండాలో మంగళవారం సాయంత్రం తాండ వాసులకు మూఢనమ్మకాలపై, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఎస్ఐ నారాయణ, మహేందర్ రెడ్డి, పోలీసు కళాబృందం పాల్గొన్నారు

నందిగామ గ్రామాన్ని సందర్శించిన డిఎల్పిఓ



నవతెలంగాణ - నిజాంపేట

మండల పరిధిలోని నందిగామ గ్రామంలో మెదక్ డిఎల్పిఓ సతీష్ కుమార్ పర్యటించి గ్రామ పంచాయతీ అసెట్స్ వెరిఫికేషన్‌లో భాగంగా పంచాయతీ కార్యదర్శి మొహమ్మద్ ఆరిఫ్ హుస్సేన్‌తో కలిసి నందిగామ గ్రామంలో హరితహరం నర్సరీ, పల్లె ప్రకృతి వనం, తెలంగాణా క్రీడా ప్రాంగణం, వైకుంఠధామం , సెగ్రిగేషన్ షెడ్ గ్రామ పంచాయతీ రికార్డ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నందిగామ గ్రామం లాగా ప్రతి ఒక్క గ్రామం తయారు కావాలని ఇదేవిధంగా అందరూ అన్ని గ్రామాల కార్యదర్శులు కృషి చేయాలన్నారు.

ప్రతి గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది

కాంగ్రెస్ జిల్లా నాయకుడు నరేందర్ రెడ్డి



నవతెలంగాణ- వెల్దుర్తి

కొనుగోలు కేంద్రంలో ఉన్న ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని కాంగ్రెస్ జిల్లా నాయకుడు నరేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధి కుక్కునూరు గ్రామపంచాయతీ పరిధిలో పిఏసిఎస్ గోదాం వద్ద తూకం చేస్తున్న ధాన్యం వద్దకు వైస్ ఎంపీపీ సుధాకర్ గౌడ్ నరసింహారెడ్డి తలారి మల్లేష్ హనుమేష్ మరి కొంతమందితో కలిసి వెళ్లి రైతులతో మాట్లాడారు. రైతులు అధైర్య పడద్దని చివరి గింజ వరకు కొనుగోలు చేసే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. పి ఎస్ సి ఎస్, ఐకెపి, సిబ్బంది ముందస్తుగా కాంటాలు ప్రారంభించినట్లయితే వర్షం పడక ముందే కొనుగోలు ప్రక్రియ అయిపోయేదని వారన్నారు. అయినా తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులకు ధీమా వ్యక్తం చేశారు.

ఘనంగా యూత్ అధ్యక్షుని జన్మదిన వేడుకలు

నవతెలంగాణ - నార్సింగి



మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నార్సింగి జెడ్పీటీసీ బానాపురం కృష్ణా రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మైలారం బాబు ల ఆధ్వర్యం లో బీఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షుడు సుదీప్ గౌడ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ, మండలాధ్యక్షుడి చేతుల మీదుగా సుదీప్ గౌడ్ కేకు ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ ఎస్ పార్టీ పెద్ద తాండా అధ్యక్షుడు బాషా నాయక్, వల్లూరు గ్రామ అధ్యక్షుడు అబ్దుల్ వాహెద్, నాయకులు వేణు, రోమాల రాజు, కుమ్మరి హరీష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సుదీప్ గౌడ్ దౌలతాబాద్ జెడ్పీటీసీ రణం జ్యోతి శ్రీనివాస్ లను కలిసి వారి దీవెనలను తీసుకున్నారు.

మరో 13 రోజులు వేచి చూడాల్సిందే

ఎన్నికలు పలితల కోసం ఎదురు చూపు

నేతలకు టెన్షన్. పనులకు ఆటంకం

నవతెలంగాణ-పెద్దశంకరంపేట



:నేతల తలరాతలు మార్చే సమయం కోసం మరో 13 రోజులు వేచి చూడాల్సిందే. లోక్ సభ ఎన్నికలు ముగిసినప్పటికి ఫలితాలు వెలువడేందుకు జూన్ 4 వరకు వేచి ఉండాలి. దీంతో విహార యాత్రలకో ఇతరాత్ర పనులకో వెళ్లేందుకు కొందరు నేతలు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. మరో వైపు సన్నిహితుల ప్రోద్భలంతో యాత్రలకు వెళ్లినా ఫలితాలు తెలిసేదాకా మనశాంతితో ఉండలేమని నాయకులు భావిస్తున్నారు. ప్రస్తుతానికి పోలింగ్ సరళి తమకు ఎక్కడెక్కడ ఎక్కువ ఓట్లు పడ్డాయి. ఎక్కడ పడలేదో అంచనాలు వేస్తున్నారు.

కాలక్షేపమేట్ల

ఎన్నికల పనుల్లో బిజీగా ఉన్న వివిధ పార్టీల కార్యకర్తలు ఇప్పుడు ఫలితాలపై అంచనాలు వేస్తూ దిక్కులు చూస్తున్నారు. నిత్యం సాయంత్రం కాగానే మందు విందులతో గడిపిన వారు ఎన్నికల ఫలితాల 13 రోజులు గడవు ఉండడంతో నేతలు ఎవరు అందుబాటులోకి రాక కార్యకర్తలను, ఓటర్లను పట్టించుకునే వారు కరువయ్యారు. ప్రచారంలో భాగంగా పార్టీ జెండాలు పట్టుకొని తిరిగేందుకు కార్యకర్తల ఖర్చులకు డబ్బులు ఇచ్చారు. జనసమీకరణ పేరిట నాయకులు డబ్బులు దండుకున్నారు. ఇప్పుడు ఎన్నికలు అయి పోగానే నేతలేవరు అందుబాటులోకి రాక ఎం చేయాలో తెలియడం లేదు

కోడ్ గండం

రాజకీయ నేతల పరిస్థితి ఆలా ఉండగా మండల, మున్సిపాలిటిలో గ్రామపంచాయతీ ప్రజలకు అవసరమైన వివిధ పనులు చేయాల్సి ఉన్నప్పటికి కొత్తగా ఏ పనులు చేపట్టలేని పరిస్థితి. జూన్ 6 వ తేది వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉండనుంది. అప్పటిదాకా ఎలాంటి సమావేశాలు నిర్వహణకు కొత్త పనుల ఆమోదానికి పథకాల ప్రారంబానికి అవకాశం లేదు. పోలింగ్ తేదికి దాదాపు రెండు నెలలు ముందుగానే ఎన్నికల షెడ్యూల్ వెలువడడంతో అప్పటి నుంచే అభివృద్ధి పనులు నిలిచిపోయాయి.

పనులయ్యేనా ?

జూన్ మొదటి వారంలో వర్ష కాలం ఆరంభంమవుతుంది. వివిధ పనులు ఆలోపునే పూర్తి చేయాల్సి ఉంది ఇప్పటికి మంజూరైనా పురోగతిలో ఉన్న పనులు సైతం మందకొడిగా కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు వివిధ ప్రభుత్వ విభాగల సిబ్బంది ఎన్నికల విధుల్లోనే ఉండడంతో పనులు కుంటుపడ్డాయి. వర్షాకాలానికి సంబంధించిన నాలాల పూడిక తీత, సీసీ రోడ్ పనులు ఇంకా పూర్తి కాలేదు అత్యవసరమైన పనులకు ఎన్నికల సంఘం నించి ప్రత్యేక అనుమతి పొందాల్సి ఉంటుందని ఎన్నికల కోడ్ ముగిసేంత వరకు ప్రజలు తమ సమస్యలను చెప్పుకునేదుకు కూడా వీలు లేదు. మళ్ళీ జూన్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తుంది. దీంతో ఆగస్టు వరకు ఎన్నికల కోడ్ ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి.

సిసి రోడ్లు వేశారు..మొరం పోయడం మరిచారు

నవతెలంగాణ -నిజాంపేట



మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు కృషితో ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో భాగంగా నిజాంపేట మండలానికి దాదాపు 1.50 (ఒక కోటి 50) లక్షల రూపాయలు సీసీ రోడ్లు వేయడం జరిగింది. అందులో నిజాంపేట మండల కేంద్రానికి 50 లక్షల రూపాయల సిసి రోడ్లు వేశారు. సిసి రోడ్లు వేసి దాదాపు రెండు నెలలు అవుతున్నప్పటికీ నేటికీ రోడ్డుకు ఇరువైపులా మొరం పోయడం మరిచారు. మొరం పోయకపోవడంతో వచ్చి పోయే వాహనదారులకు ఇబ్బంది ఏర్పడుతుందని గ్రామస్తులు చెబుతున్నారు. సిసి రోడ్ల పైనుండి ట్రాక్టర్లు ఆటోలు వెళ్లాలంటే వాహనదారులు జంకుతున్నారు. ఒక వాహనం వెళ్ళినప్పుడు మరో వాహనము ఎదురుగా రావాలంటే ఇబ్బంది ఏర్పడుతుంది. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సీసీ రోడ్డుకు ఇరువైపులా మొరం పోసేలా తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మాట మారుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

నవ తెలంగాణ-రాయపోల్



ఎన్నో అబద్ధపు హామీలను ఇచ్చి మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మాట మారుస్తుందని బీఆర్ఎస్ రాష్ట్ర యువజన విభాగం నాయకులు అనుమండ్ల రాజిరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే వరి పంట పండించిన రైతులకు క్వింటాలకు రూ.500 బోనస్ చెల్లించి కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు రూ.500 ల బోనస్ ఇవ్వమని ప్రశ్నిస్తే మేము సన్నవడ్లు పండించిన రైతులకు మాత్రమే రూ.500ల బోనస్ ఇస్తామని క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. అధికారంలోకి రాకముందు సన్నవడ్లు, దొడ్డువడ్లు అని తేడా లేకుండా వడ్లు పండించిన రైతులందరికీ 500 బోనస్ ఇస్తామని, అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పడం జరిగిందన్నారు. రైతుల పట్ల చిత్తశుద్ధి ఉంటే వడ్ల రైతులు అందరికీ బోనస్ ఇవ్వాలన్నారు.

ఆయిల్ పామ్ రైతులకు క్షేత్రస్థాయి శిక్షణ

నవతెలంగాణ - నార్సింగి



ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి డీ. నర్సయ్య ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ రైతులకు డ్రిప్పు లో ఫర్టిగేషన్ పద్ధతిలో ఎరువులను అందించడం, ఆసిడ్ ట్రీట్మెంట్ పద్ధతులను వివరించే క్షేత్రస్థాయి కార్యక్రమాన్ని మండల పరిధిలోని నర్సంపల్లి లో అబ్దుల్ సత్తార్ కి చెందిన ఆయిల్ పామ్ క్షేత్రం లో నిర్వహించారు. క్షేత్ర స్థాయి ప్రదర్శన ద్వారా ఆధునిక పద్ధతులను తెలుసుకోవడం వల్ల తమకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, ప్రదర్శన పట్ల రైతులు ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి తో పాటు క్లస్టర్ లెవెల్ ఉద్యాన అధికారులు రామకృష్ణా, మౌనిక రెడ్డి, ఎం. సంతోష్, ఆయిల్ పామ్ జిల్లా మేనేజర్ డాక్టర్ కృష్ణ, మైక్రో ఇరిగేషన్ పరిశ్రమ సిబ్బంది, ఆయిల్ పామ్ పరిశ్రమ ఫీల్డ్ సిబ్బంది, వ్యవసాయ శాఖ ఏఈఓ విజృంభణ, రైతులు పాల్గొన్నారు.

మైనంపల్లికి మంత్రి పదవి ఇవ్వాలి

హాజి అలి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

నవతెలంగాణ - నార్సింగి



మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుకు రాష్ట్రంలో త్వరలో జరగబోయే మంత్రి వర్గ విస్తరణలో మంత్రి పదవి రావాలని నార్సింగి మండల కాంగ్రెస్ నాయకుడు, టెలికాం బోర్డ్ మాజీ సభ్యుడు అంచనూరి రాజేష్ మంగళవారం ముంబయిలోని హజి అలీ దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రజా సేవ తప్ప స్వార్థ గుణం లేని మచ్చ లేని నాయకుడు మైనంపల్లి అని కొనియాడారు. అలాంటి నాయకుడైన మైనంపల్లి హన్మంతరావు కు ఎమ్మెల్సీ ఇవ్వాలని, అలాగే ఈ సారి జరగబోయే మంత్రివర్గ విస్తరణలో ఖచ్చితంగా మంత్రి పదవి ఇవ్వాలని కోరారు. ఈ ప్రార్థనలో కాంగ్రెస్ నేత చందు యాదవ్ రాజేష్ తో పాటు పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీ సేవలు మరువలేనివి





నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో మంగళవారం మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. రాహుల్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ సింగల్ విండో చైర్మన్ బోలిశెట్టి శివయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బంక చందు, కౌన్సిలర్ వల్లపు రాజు, మడప యాదవ రెడ్డి, గడిపే రమాదేవి, పూదరి శ్రీనివాస్, కాసవీని రమేష్, కైలు నాయక్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నవ తెలంగాణ-పటాన్‌చెరు

దేశానికి సాంకేతికతను తీసుకుని వచ్చి ప్రపంచంలో టెక్నాలజీ విప్లవంలో భారత్‌ను నిలిపింది రాజీవ్ గాంధీయేనని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ అన్నారు. రాజీవ్‌గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని చిట్కుల్‌లోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో సాంకేతిక విప్లవానికి నాంది పలికింది రాజీవ్ గాంధీయేనన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాల సరసన భారత దేశాన్ని నిలిపిన ఘనత ఆయనదేనని గుర్తుచేశారు. దేశంలో బీదరికాన్ని పారద్రోలి సమసమాజ స్థాపనకు ఆయన చేసిన కృషి ఎప్పటికి మరవలేమని కొనియాడారు. దేశం కోసం తన ప్రాణాలను అర్పించి దేశ ప్రజల గుండెల్లో చిరకాలంగా నిలిచిన ఘనత మహనీయుడు రాజీవ్ సొంతమని ఆయన పేర్కొన్నారు.

నవతెలంగాణ- కొల్చారం

దేశానికి సాంకేతికతను తీసుకువచ్చింది రాజీవ్ గాంధీనేనని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగుల గారి మల్లేశం గౌడ్ అన్నారు. రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం మండల కేంద్రమైన కొల్చారంలో రాజీవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మల్లేశం గౌడ్ మాట్లాడుతూ దేశంలో సాంకేతిక విప్లవానికి నాంది పలికింది రాజీవ్ గాంధీనే అని అన్నారు. అభివృతఋద్ధి చెందుతున్న దేశాల సరసన భారత దేశాన్ని నిలిపిన ఘనత ఆయనదేనని గుర్తుచేశారు. గ్రామాల అభివృద్ధికి రాజీవ్ గాంధీ ఎంతగానో కృషి చేశారని, ఐటీ రంగంలో నేడు ఇండియా అగ్రగామిగా ఉందంటే రాజీవ్ గాంధీ కృషి ఫలితమే అన్నారు. ఈ కార్యక్రమంలో గౌడసంఘం మండల అధ్యక్షుడు వెంకట్ గౌడ్, ఉపాధ్యక్షులు ముత్యం గారి గోవర్ధన్, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గంగసాని మహేశ్వర్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు దేవన్నగారి శేఖర్, గ్రామ శాఖ అధ్యక్షులు ఆశన్నగారి శ్రీశైలం, మైనార్టీ సెల్ మండల్ ప్రెసిడెంట్ సయ్యద్ అక్రం, పోతిరెడ్డిపల్లి మాజీ ఎంపిటిసి రూప్ల, కాంగ్రెస్ నాయకులు సంగప్ప, రవీందర్ నాయక్, మహేష్ గౌడ్, విట్టల్ గౌడ్, ఎన్ యూఐ నాయకులు మహమ్మద్ సమీర్ తదితరులు పాల్గొన్నారు.





నవతెలంగాణ- నిజాంపేట

మండల కేంద్రంలోని కొత్త బస్టాప్ వద్ద మాజీ ప్రధానమంత్రి దివంగత నేత రాజీవ్ గాంధీ 33వ వర్ధంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మారుతి, జిల్లా కార్యదర్శి మహేందర్, ఎం ఎస్ ఎస్ ఓ మండల ఇన్చార్జి వెల్దుర్తి వెంకటేష్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు నసీరుద్దీన్, ముత్యాల సత్యనారాయణ రెడ్డి ,లింగం గౌడ్, బోయిని చంద్రం, తాజా మాజీ ఉపసర్పంచ్ బాబు, బాజే రమేష్, రుచిత, నరేందర్, గరుగుల సుధాకర్, రాజేందర్ గౌడ్, ,దేవేందర్ నాయక్ , భూమా గౌడ్, శ్రీకాంత్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

నవ తెలంగాణ- వెల్దుర్తి

రాజీవ్ గాంధీ 33 వ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేష్ రెడ్డి జిల్లా నాయకుడు నరేందర్ రెడ్డి, వైస్ ఎంపీపీ సుధాకర్ గౌడ్, నరసింహారెడ్డి, ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విప్లవాత్మక దార్శనిక విధానాల ద్వారా ఆధునిక భారతదేశాన్ని నిర్మించడంలో అందించిన సహకారం సర్వదా చిరస్మరణీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తలారి మల్లేష్, హనుమేష్, పోతిరెడ్డి, శ్రీనివాస్, పోతిరెడ్డి, అంజా గౌడ్, దుర్గా గౌడ్, కిష్టా గౌడ్, శేఖర్, మరి కొంతమంది కాంగ్రెస్ శ్రేణులు ఉన్నారు.



రాజీవ్ గాంధీ వర్ధంతి



నవతెలంగాణ-సిద్దిపేట

సిద్దిపేట జిల్లా ఓబీసీ సెల్, ఎన్ఎస్‌యూ అధ్వర్యంలో రాజీవ్ గాంధీ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ సూర్యవర్మ, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కో ఆర్డినెటర్ దాసరి రాజు మాట్లాడుతూ రాజీవ్ గాంధీ యువ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించి మన దేశానికి ఎనలేని సేవలు చేశారన్నారు. దేశానికి అత్యంత పిన్న వయస్కుడైన ప్రధాన మంత్రి అని అన్నారు. టెలికమ్యూనికేషన్, ఐటీ రంగానికి పునాదులు వేసి భారతదేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించారన్నారు. భారతదేశం అంతటా ఉన్నత విద్యా కార్యక్రమాలను ఆధునీకరించడానికి, విస్తరించడానికి జాతీయ విద్యా విధానాన్ని ప్రకటించారన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి జంగోని శ్రీనివాస్, దిలీప్, మోతే కుమార్, బీసీ సెల్ మండల అధ్యక్షులు మిద్దె ప్రసాద్, నవీన్, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి కొండలవాడి సతీష్, బడికోల్ రాకేష్ యాదవ్, అర్జున్, రాకేష్, సాజిద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నంగునూరులో రాజీవ్ గాంధీ వర్ధంతి



నవతెలంగాణ-నంగునూరు

భారతదేశ మాజీ ప్రధాని, స్వర్గీయ రాజీవ్ గాంధీ 33వ వర్ధంతిని మండల కేంద్రంలోనిబాబు జగ్జీవన్ రాం చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సోషల్ మీడియా సిద్దిపేట జిల్లా కోఆర్డినేటర్ చెలికాని యాదగిరి యాదవ్, టీసీ సెల్ నంగునూరు మండల అధ్యక్షుడు జంగిటి శ్రీనివాస్, గ్రామ శాఖ అధ్యక్షుడు అనరాజు నాగరాజు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు రాగుల కృష్ణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాలయ్య, రాములు, ఎక్క రాజు, చింటూ, శ్రీకాంత్, శ్రీను, శీను తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో పెసర, వరి విత్తనాలు

నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల మండల రైతులకు పెసర, వరి విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి ఎండీ. అఫ్రోజ్ మంగళవారం తెలిపారు. పెసర 4 కిలోల బ్యాగు రూ.480 అని, వరి విత్తనాలు ఆర్ఎస్ఆర్ 15048 రకం రూ.1110 లు కె ఎన్ ఎం 1638 రకం విత్తనాలు రూ.1000 లకు లభిస్తున్నట్లు పేర్కొన్నారు. విత్తనాలు చేర్యాల పట్టణ కేంద్రంలోని ఆంధ్ర బ్యాంకు ఎదురుగా ఉన్న అగ్రోస్2 లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

24న సిద్దిపేటలో పాలిసెట్ పరీక్షా

నవతెలంగాణ-నంగునూరు

సిద్దిపేటలోని 6 సెంటర్‌లలో ఈ నెల 24వ తేదిన పాలిటెక్నిక్ పరీక్షా జరుగుతుందని నంగునూరు మండలం రాజగోపాల్ పేట పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, పాలిసెట్ కోఆర్డినేటర్ సూర్య నారాయణ తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు నిర్వహిస్తామని చెప్పారు. ఈ పాలీసెట్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు గంట ముందుగా పరీక్ష సెంటర్ కు చేరుకోవాలన్నారు. ఒక్క నిమిషం నిబంధన ఉండడంతో నిమిషం ఆలస్యమైనా అనుమతించరని తెలిపారు. మొత్తం 2,307 మంది పరీక్ష రాయనున్నారని వెల్లడించారు.

దార్శానిక ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ

- కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ముక్కీస రత్నాకర్ రెడ్డి



నవతెలంగాణ-బెజ్జంకి

దేశ ఆర్థిక వ్యవస్థను సరళీకృతం చేయడానికి విశేష సేవలందించి రాజీవ్‌గాంధీ దార్శానికా ప్రధానమంత్రిగా చిరస్మరణీయుడయ్యాడని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ముక్కీస రత్నాకర్ రెడ్డి కొనియాడారు. మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మండల కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి మండల కాంగ్రెస్ శ్రేణులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు అక్కరవేణి పోచయ్య, లింగాల శ్రీనివాస్, మంకాల ప్రవీన్, రొడ్డ మల్లేశం, గూడెల్లి శ్రీకాంత్, బండిపెల్లి రాజు, మానాల రవి, చిలువేరు శ్రీనివాస్ రెడ్డి, మెట్ట నాగారాజు, జెల్లా ప్రభాకర్, మాజీ సర్పంచులు ద్యావనపల్లి శ్రీనివాస్, రావుల నర్సయ్య, మాజీ ఉప సర్పంచ్ హరికృష్ణ, మిట్టపల్లి చెన్నారెడ్డి, బైరి సంతోష్, కొంపల్లి మల్లేశం, అయా గ్రామాల కార్యకర్తలు హజరయ్యారు.

బెస్ట్ అవైలేబుల్ స్కూల్‌లో ప్రవేశాలు

- జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి కవిత

నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

జిల్లాలోని బెస్ట్ అవైలేబుల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి కవిత తెలిపారు. 2024-25వ సంవత్సరానికి జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల్లో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పాఠశాలలో ప్రవేశం కొరకు విద్యార్థుల తల్లిదండ్రులు రేషన్ కార్డ్, ఆధార్ కార్డ్, గత సంవత్సరం పూర్తి చేసిన తరగతి బోనాఫైడ్ సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలు, 2 పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు ఫారాలను జిల్లా షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ కార్యాలయం నుంచి పొంది పూర్తి చేసిన ధరఖాస్తులను జూన్ 6వ తేదిలోగా కార్యాలయంలో అందజేయాలన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-తొగుట



మండల కేంద్రానికి చెందిన నాగోళ్ల నర్సయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ప్రైవేట్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు పాగాల రాజిరెడ్డి మంగళవారం మృతుని కుటుంబ సభ్యులకు నిత్యావసర వస్తువులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నర్సయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఎవరైనా దాతలు ముందుకు వచ్చి వారి కుటుంబానికి ఆర్థిక సహాయం చేయాలని కోరారు.

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి



నవతెలంగాణ-చేర్యాల

స్వర్గీయ మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం కాంగ్రెస్ పార్టీ చేర్యాల పట్టణ కమిటీ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలను నాయకులు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు మంచాల చిరంజీవులు, మాజీ జడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు, కొమురవెల్లి దేవస్థానం కమిటీ మాజీ అధ్యక్షులు ఆడెపు చంద్రయ్య, కౌన్సిలర్ ఆడెపు నరేందర్, పార్టీ సీనియర్ నాయకులు పుర్మ ఆగం రెడ్డి, ముస్త్యాల కిష్టయ్య, పాల లక్ష్మి నారాయణ, దాసరి శ్రీకాంత్, నీలం సన్నీ, మామిడాల నాగరాజు, పోతుగంటి ప్రసాద్, అంబాల రాములు గౌడ్, భూమిగారి మనోహర్, నర్ర కేశవులు, మేడిచెలిమే రాకేష్, రేకులపల్లి సాయి కుమార్ పాల్గొన్నారు.

వరదరాజస్వామి జాతర ఆహ్వాన పత్రిక అందజేత

నవతెలంగాణ-మర్కుక్



మండల పరిధిలోని వరదరాజపూర్ గ్రామంలో రెండవ కంచిక విరాజిల్లుతున్న వరదరాజస్వామి జాతరకు రావాలని మెదక్ కాంగ్రెస్ పార్టీ లోకసభ అభ్యర్థి నీలం మధుకు కాంగ్రెస్ నాయకులు ఆహ్వానం పలికారు. నిర్వాహకులు పటాన్‌చెరువులోని ఆయన నివాసంలో కలిసి మంగళవారం కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు తాండ కనకయ్య గౌడ్, వరదరాజపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డీలర్ కిష్టయ్యలు కలిసి ఈ నెల 25వ తేదిన నిర్వహిస్తున్న జాతరకు రావాలని కోరుతూ జాతర ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మల్లేష్ యాదవ్, కిష్టయ్య బాబి, ప్రభాకర్ తదితరులున్నారు.

వాసవి వనిత క్లబ్ సేవలు అభినందనీయం

వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షుడు గంప శ్రీనివాస్

నవతెలంగాణ-సిద్దిపేట



వాసవి క్లబ్ వనిత చేస్తున్న సవాలు అభినందనీయమని వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షుడు గంప శ్రీనివాస్ అన్నారు. మంగళవారం భారత్ నగర్‌లో శ్రీ వృద్ధాశ్రమంలో దాత కొమరవెల్లి అంజమ్మ, రాంరాజేశం ఆర్థిక సహాయంతో బీరువాను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దిపేట వనిత క్లబ్ వారు చాలా మంచి కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. గోమాత సేవలు, వాసవి మాత పారాయణాలు, పుస్తె మట్టెలు పంపిణీ వంటి కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ గంప కృష్ణమూర్తి, రీజియన్ చైర్మన్ మంకాల శ్రీనివాస్, అధ్యక్షురాలు మర్యాల వాణి, వీరేశం, రామకృష్ణ, అంతయ్య, జయరాములు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు తలకు మించిన పని భారం

- గజ్వేల్‌లో మరో రెండు కొత్త మండలాలు
- మరో రెండు కొత్త పోలీస్ స్టేషన్లు ఏర్పాటుకు అవకాశం
- మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి దృష్టి పెట్టాలి
- మల్లన్నసాగర్ పునరావాస కాలనీ ఏర్పాటుతో పెరిగిన పట్టణ జనాభా

నవతెలంగాణ-గజ్వేల్


గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీతో పాటు గజ్వేల్ మండలం గ్రామ పంచాయతీల సంఖ్య 26 ఉండడంతో రెండు మండలాలను ఏర్పాటు చేస్తే పరిపాలన పరంగా సులభం అవుతుందని స్థానికులు భావిస్తున్నారు. గజ్వేల్ రూరల్, గజ్వేల్ అర్బన్ మండలాలుగా విభజించాలి. ఈ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెడితే సాధ్యమవుతుందని స్థానికులు అంటున్నారు. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి ఈ విషయంలో సంబంధిత శాఖ మంత్రులతో చర్చించి ఏర్పాటుకు ముందుకు వెళ్లాలని కోరుతున్నారు. అదేవిధంగా జనాభా ప్రకారంగా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్‌తో పాటు గజ్వేల్ మండలంలో రెవిన్యూ పరంగా, పోలీస్ శాఖ పరంగా సమస్యలు తక్షణమే పరిష్కారం కోసం కొత్త మండలాలతో పాటు కొత్త పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేస్తే బాగుంటుందని ప్రజలు భావిస్తున్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో ఒక మర్కుక మినహా ఎక్కడ కొత్త మండలం ఏర్పాటు కాలేదు. గజ్వేల్ మండలంలో మరో రూరల్ మండలం అవసరముంది. జగదేపూర్ మండలంలో తిగుల్ మేజర్ గ్రామపంచాయతీ మండల కేంద్రం ఏర్పాటు చేయాలని ఉద్యమం జరుగుతుంది. గజ్వేల్ మండలంలో 26 గ్రామ పంచాయతీలు ఉండగా పరిపాలనపరంగా కొంత ఇబ్బందిగా మారింది. రూరల్ మండలం అవసరముందని స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు కోరుతున్నారు. గతంలో మండలాలను, రెవెన్యూ డివిజన్లను జిల్లాలను అందించిన కేసీఆర్ గజ్వేల్ మండలం విభజనపై దృష్టి సారించలేదని చెప్పవచ్చు. గజ్వేల్ మండల కేంద్రం నుంచి గ్రామీణ స్థాయికి సేవలు అందాలంటే ఇబ్బందిగా ఉంది. ప్రజలకు సేవలు అందడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల ఏడాది ముందు కుమారుపల్లిని. మండలంగా ఏర్పాటుచేసినా కిలోమీటర్ల దూరంలో ఉన్న గజ్వేల్ మండలంలో కొడకండ్ల గ్రామాన్ని కుకునూరు పల్లిలో కలపలేదు. 2016లో జిల్లాల పునర్విభజన దౌల్తాబాద్ మండలంలో ఉన్న ఆరేపల్లి గ్రామాన్ని గజ్వేల్ మండలంలో కలిపారు. దీంతో 26 గ్రామపంచాయతీలుగా ఏర్పడింది. మల్లన్న సాగర్ ప్రాజెక్టులో కోల్పోయిన 14 గ్రామాలు ప్రజ్ఞాపూర్ మున్సిపల్‌లో విలీనం చేసేందుకు అధికారులు ఓటర్ నమోదు కార్యక్రమం పూర్తి చేశారు. దీంతో పట్టణ జనాభా రోజురోజుకు పెరిగిపోయి పరిపాలన పరంగా అన్ని శాఖ అధికారులకు తలకు మించిన భారంగా మారింది.

రెవెన్యూ అధికారులపై పెరిగిన ఒత్తిడి

పట్టణ భూముల విలువ అమాంతం పెరిగిపోవడం వీఆర్వో వ్యవస్థను రద్దు చేయడంతో రెవెన్యూ అధికారులపై ఒత్తిడి బాగా పెరిగింది. మల్లన్న సాగర్ కాలనీ పనులను చూసేందుకు ఇద్దరు అధికారుల పూర్తిస్థాయిలో అక్కడనే ఉంటున్నారు. దీంతో స్థానికగా ప్రజలకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందించాలంటే ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వ భూములను కాపాడడం కత్తి మీద సాములా మారింది. ఇప్పటికీ అనేక చోట్ల ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. రెవెన్యూ అధికారులకు అండగా ఉండే విఆర్ఓలను రెగ్యులర్ చేయలేదు. ఇక పట్టణంతో పాటు 26 గ్రామాల ప్రజల పౌర సేవలు సమయానికి అందక పోవడంతో అనేక ఇబ్బయలు పడుతున్నారు. ప్రత్యేక మండలంగా విభజన ద్వారా సమస్య పరిష్కారం అవుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

అన్ని శాఖలకు పని భారం

పట్టణం రోజురోజుకు విస్తరించడం కొత్తగా బైపాస్ గజ్వేల్ ప్రజ్ఞాపూర్ రింగ్ రోడ్డు రావడం రైల్వే లైన్ అందుబాటుకు వచ్చాయి. రైలు రాకపోకలు సాగిస్తున్నారు. మల్లన్న సాగర్ ముంపు గ్రామాల జనాభా పెరిగిపోవడంతో పోలీసులకు కొంత ఇబ్బందిగా మారింది. గజ్వేల్ పట్టణంతోపాటు గజ్వేల్ మండలం రూరల్ ప్రాంతంలో 26 గ్రామపంచాయతీలు ఉన్నాయి. జనాభా పెరుగుదలతో పాటు పోలీస్ స్టేషన్లో కేసులు ఫిర్యాదుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుంది. 2020 తర్వాత కేసులు పెరుగుతూ వచ్చాయి. ప్రస్తుతం 600కు చేరింది. గతంలోనే గజ్వేల్ రూరల్ పోలీస్ స్టేషన్, జగదేపూర్, కుక్కునూరు పల్లి కలుపుతూ రూరల్ సర్కిల్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదన పంపారు. గజ్వేల్ పట్టణానికి ఇన్స్పెక్టర్, ఎస్ హెచ్ ఓ గా ప్రత్యేక టౌన్‌కు





పరిమితం చేయడంతో పాటు తొగుట సర్కిల్ పరిధిలో ఉన్న బేగంపేట్, రాయపోల్, తొగుట, దౌల్తాబాద్‌లను ప్రతిపాదించారు. కానీ ఇప్పటి వరకు పోలీసు ఉన్నంత అధికారుల వద్దనే ఫైల్ ఉండిపోయింది. గజ్వేల్ పట్టణం రోజు రోజుకు జనాభా పెరగడంతో ప్రస్తుతం లక్ష పైగా జనాభా చేరింది. దీంతో ట్రాఫిక్ సమస్యలు పెరుగుతున్నాయి. దీంతో పట్టణ విస్తీర్ణంతోపాటు మల్లన్న సాగర్ 14 గ్రామాలు రావడంతో గతంలో 40,000 ఉన్న జనాభా లక్షకు పైగా పెరిగింది. కొన్నిచోట్ల 9 గ్రామాలతోనే మండలం ఏర్పాటు చేశారు. గజ్వేల్ మండలంలో 26 గ్రామాలు ఉన్న రూరల్ మండలంపై ఎందుకు దృష్టి పెట్టడం లేదని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రూరల్ మండలం ఏర్పాటు చేస్తే పరిపాలనకు సులభంగా ఉంటుందని స్థానికులు అంటున్నారు.

మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి దృష్టి సారించాలి

గజ్వేల్ నియోజకవర్గం కేంద్రం గజ్వేల్ మండలాన్ని విస్తరణ పెరగడంతో గజ్వేల్ రూరల్ మండలం మరొకటి ఏర్పాటు చేయాలి. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ పరిధిలోని రూరల్ సిఐతో పాటు టౌన్, రూరల్ పోలీస్ స్టేషన్ ఏర్పాటుపై దృష్టి పెట్టాలి. జనాభా పెరుగుతున్నందున సమస్యలు రాకుండా గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి దృష్టి పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అర్హులైన వారందరికి తెల్ల రేషన్ కార్డులను ఇవ్వాలి

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రసాద్ డిమాండ్

నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

అర్హులైన పేదలందరికీ తెల్ల రేషన్ కార్డులు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. ప్రసాద్ డిమాండ్ చేశారు. స్థానిక జిల్లా కేంద్రంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు వెంకట్ మావో అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గత ఎన్నికల్లో గ్రామీణ ప్రాంత భూమిలేని వ్యవసాయ కార్మికులకు, కౌలు రైతులకు రూ. 12000, మహిళలకు రూ. 2500, ఇండ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామన్న ఆరు గ్యారెంటీల హామీలలో ఉన్న ముఖ్యమైన వాటిని అమలు చేయక పోవడం ఆందోళన కలిగిస్తుందన్నారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధి కూలీల బకాయిల విడుదలకు తక్షణమే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్బాటంగా గ్రామీణ ప్రాంత పేదలకు ప్రకటించిన హామీల గురించి నేటి వరకు మాట్లాడకపోవడం ప్రభుత్వ దాటవేత చర్యలకు నిదర్శనం అన్నారు. గ్రామపంచాయతీ యూనిట్‌గా కౌలు రైతులను, భూమిలేని వ్యవసాయ కార్మికులను, అవకాశాన్ని ఇండ్ల స్థలాలు లేని పేదలను గుర్తించటానికి చర్యలు చేపట్టాలని కోరారు. స్థలాలు ఉన్నవారికి ఐదు లక్షలు ఇంద్రమ్మ ఇల్లు కట్టుకోవడానికి ఇస్తామన్న వాగ్దానం అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ స్థలాలలో గుడిసెలు వేసుకున్న పేదలకు ఆ భూములపై హక్కు పట్టాలిచ్చి ఇల్లు కట్టుకోవడానికి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 1,20,000 మంది వ్యవసాయ కూలీలు గ్రామీణ ఉపాధి కూలీలుగా పనిచేస్తున్నారని నాలుగు వారాల పైన కూలీలు చేసిన పనికి వేతనాలు చెల్లించలేదని తక్షణమే బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పనిచేసే దగ్గర కనీస సౌకర్యాలు లేవని అన్నారు తాగడానికి మంచినీళ్లు కూడా సరఫరా చేయకపోవడం దుర్మార్గం అన్నారు. ఎస్సీ ఎస్టీల బీడు భూముల అభివృద్ధికి చిన్న సన్నకారు రైతుల భూముల అభివృద్ధికి గ్రామీణ ఉపాధి పనులు పెట్టాలని డిమాండ్ చేశారు. చౌడు భూములకు చెరువుల వండ్రు మట్టిని సాగుపాములకు ఫ్రీగా తోలాలని, చేసిన పనికి వారం వారం వేతనాలు చెల్లించాలని, పని చూపని దగ్గర నిరుద్యోగ భృతి చెల్లించాలని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదని అన్నారు. క్యూబిక్ మీటర్ల కొలతల పేరుతో చట్ట ప్రకారం రూ.300



వేతనం పడకుండా చేస్తున్నారని పని ప్రదేశంలో ఉదయం సాయంత్రం ఫోటోలు తీసే పేరుతో కూలీలను తీవ్రంగా వేధిస్తున్నారని తక్షణమే ఈ చర్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కూలీలందరకు పారా పలుకు తట్ట గొడ్డలి కొడవలి వంటి పనిముట్లు ఇవ్వాలని కిలోమీటర్లు దాటిన పనికి లోకల్ ఆటో చార్జీ ఇవ్వాలని చట్టంలో ఉన్న అధికారులు అమలు చేయకపోవడం వలన కూలీలు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. ఎండలు తీవ్రతను దృష్టిలో పెట్టుకొని త్రాగడానికి మంచినీరు నీడకు టెంటు మెడికల్ కిట్టు ఇవ్వాలని కోరారు సమావేశంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాళ్ల బండి శశిధర్, జిల్లా ఉపాధ్యక్షులు మాజీ సర్పంచ్ తాడూరి రవీందర్, జిల్లా సహాయ కార్యదర్శి గొర్రె శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు బండారు రమేష్ గుండ్ర రవీందర్, గజిబిన్కర్ బాలకిషన్, శ్రీనివాస్, మల్కనీ ఎల్లయ్య పాల్గొన్నారు.

కార్మికుల కోసం ఉచితంగా హెల్త్ క్యాంపులు

నవతెలంగాణ-నంగునూరు



నంగునూరు మండలంలోని ప్రతి గ్రామంలో కామన్ సర్వీస్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచితంగా హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేశామని బీఆర్ఎస్ మండల కార్మిక విభాగం అధ్యక్షులు గోనెపల్లి సిద్దేశ్వర్ గౌడ్ తెలియజేశారు. మంగళవారం నంగునూరు మండలం అక్కెనపల్లి గ్రామంలో సీఎస్సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు గతంలో అర్హులుగా ఉన్న నియోజకవర్గ ప్రతి కార్మికుడికి. ఉచిత లేబర్ కార్డు ఇప్పించడం జరిగిందని పేర్కొన్నారు. అందులో భాగమే ప్రతి లేబర్ కార్డు ఉన్న కార్మికులకి ఎలక్ట్రీషియన్, ప్లంబర్స్, మేషన్ శిక్షణ ఇప్పించి ఉపాధి కల్పించారన్నారు. మహిళలకు కుటుంబ ఉపాధి కోసం ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కల్పించి, కుట్టు మిషన్లు కూడా పంపిణీ చేయడం జరిగిందని చెప్పారు. కార్మికులకు, కార్యకర్తలకు గతంలో హెల్త్ క్యాంపులు, ఫ్రీ టెస్ట్ లు కూడా నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఇప్పుడు లేబర్ కార్డు ఉన్న కార్మికుల కోసం నంగునూరు మండలం ప్రతి గ్రామంలో ఉచితంగా కామన్ సర్వీస్ సెంటర్ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపు ద్వారా ఉచిత హెల్త్ చెకప్ టెస్టులు నిర్వహించడం జరుగుతుందని ఈ అవకాశం ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని కోరారు.

మల్లన్న సాగర్ నిర్వాసితులకు ఆశలు తప్ప ఆంక్షలు నెరవేరలేదు

- డిబిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు

నవతెలంగాణ-గజ్వేల్



మల్లన్న సాగర్ ముంపు గ్రామాలకు ఆశలు పెంపువైపు తప్ప ఆంక్షలు నెరవేర్చడం లేదని దళిత బహుజన ఫ్రంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మల్లన్న సాగర్ ముంపు గ్రామాల ప్రజలను ఆనాటి ప్రభుత్వం ప్రాజెక్టు పేరుతో ఊరు నుంచి అతికిరాతంగా నెట్టేసి ఇస్తానన్న ఇంకా కొన్ని హామీలు ఇంతవరకు బాధితులకు చేరని హామీలుగా మిగిలిపోయాడన్నారు. వారికి పని లేక జీవనోపాధికి ఇబ్బందికి గురై మద్యానికి అలవాటై కుటుంబం రోడ్డ పాలు పడే పరిస్థితి అయిందన్నారు. కన్నతల్లి లాంటి ఊరుని త్యాగం చేసిన వారిని ఇంతకు ముందుకు పాలించిన ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు ఉన్న తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ముంపు గ్రామాలకు అండగా నిలిచి వారి త్యాగానికి తగ్గ ఫలితాన్ని ఇచ్చి పని సౌకర్యాన్ని కల్పించాలన్నారు. మల్లన్న సాగర్ నిర్వాసితులకు పూర్తి బెనిఫిట్స్ అందించిన తర్వాత డబుల్ బెడ్ రూమ్లు పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణ పేదలను 9 సంవత్సరాలుగా గత ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేసిందని ప్రస్తుత ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

మెదక్ బీజేపీ అభ్యర్థిని కలిసిన మాజీ సర్పంచ్

నవతెలంగాణ-తొగుట



రాబోయే రోజుల్లో మెదక్‌తో పాటు దుబ్బాక నియోజకవర్గాని మరింత అభివృద్ధి చేస్తానని దుబ్బాక మాజీ ఎమ్మెల్యే, మెదక్ పార్లమెంట్ అభ్యర్థి మధవనేని రఘునందన్ రావు అభిప్రాయం వ్యక్తం చేశారు. మంగళవారం చందాపూర్ మాజీ సర్పంచ్ బొడ్డు నర్సింలు మాజీ ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మెదక్‌తో పాటు దుబ్బాకను అభివృద్ధి చేస్తానని తెలిపారని చెప్పారు. మెదక్ ఎంపీగా రఘునందన్ రావు 2 లక్షల ఓట్ల మెజారితో గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. దేశంలో అట్లాగే మోడీ పాలించే విధానం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ప్రజలలో మోడీ పై రోజు రోజుకు అభిమానం పెరుగుతోందన్నారు. జరిగిన లోక్ సభ ఎన్నికల్లో తొగుట మండలంలో ఏ ఇంటికి వెళ్ళిన ప్రజలు మోడీ మళ్లీ రావాలని విశ్వాసం వ్యక్తం చేశారన్నారు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెర వేర్చలేక విఫలమైందన్నారు. సిద్దిపేటలో మాజీ కలెక్టర్‌గా విధులు నిర్వహించిన వెంకట రామి రెడ్డి మల్లన్న సాగర్ ముంపు గ్రామాల ప్రజలకు తీరని నష్టం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. జూన్ 4వ తేదీన మెదక్ పార్లమెంటు ఫలితాల్లో బీజేపీ విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో విప్లవాత్మక మార్పులు

నవతెలంగాణ-మిరుదొడ్డి



ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో విప్లవత్మక మార్పులు తీసుకువచ్చిన ఘనుడు రాజీవ్ గాంధీ అని దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్, మండల అధ్యక్షుడు అక్కపల్లి బాల్ నర్సాగౌడ్ అన్నారు. అక్బర్ పేట భూంపల్లి మండలంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 33వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాంకేతిక టెక్నాలజీ విప్లవం ద్వారా భారత దేశాన్ని ఐటీ, టెలికాం, అంతరిక్ష పరిశోధన రంగాలలో ప్రపంచంలో అగ్రగామిగా నిలిచేందుకు పునాదులు వేసిన మహనీయుడు దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ అని కొనియాడారు. దేశం కోసం తన ప్రాణాలను త్యాగం చేసిన మహనీయుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో భూంపల్లి ఎంపిటిసి అబ్బుల ఉమారాణి బాలా గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి కోనపురం బాలు, మండల ఫిషర్మెన్ అధ్యక్షులు అన్నబోయిన చంద్రశేఖర్, మహిళ మండల అధ్యక్షురాలు కూతురి సుమలత, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు భూంపల్లి భీమ్రావు, బాల్తే వెంకటేశం, ఎల్లన్న గారి మధుసూదన్ రెడ్డి, షేర్ పల్లి స్వామి అక్బర్ పేట గ్రామ అధ్యక్షుడు కూతురి చందు, భూంపల్లి గ్రామ అధ్యక్షుడు ఎల్లన్న గారి సురేందర్ రెడ్డి, బేగంపేట గ్రామ అధ్యక్షుడు ఉద్ధమారి సతీష్, నిఖిల్, నగరం కిషన్, అన్న బోయిన సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పందిల్లలో ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్



హుస్నాబాద్ మండలంలోని పందిల్ల గ్రామంలో ఆర్‌వి ఎం మెడికల్ కాలేజ్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు రోజులకు ఉచిత వైద్య సేవలు అందించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచిత మందులను పంపించేశారు.

రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కాంగ్రెస్

నవతెలంగాణ-నంగునూరు: రైతు వ్యతిరేక విధానాలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్లు ఎడ్ల సోమిరెడ్డి, రాగుల సారయ్య, సొసైటి చైర్మన్లు కోల రమేశ్ గౌడ్, ఎల్లంకి మహిపాల్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆనగోని లింగం గౌడ్‌లు ఆరోపించారు. మంగళవారం వారు 'నవతెలంగాణ'తో మాట్లాడుతూ గ్యారెంటీలలో వరి పంటకు రూ.500 బోనస్ అని ప్రకటించి, ఇప్పుడు సన్న వడ్లకు మాత్రమే అని సన్నాయి నొక్కులు నొక్కుతారా అని నిలదీశారు. ఇది ముమ్మాటికీ ప్రజా పాలన కాదని, రైతు వ్యతిరేక పాలనంటూ ఎద్దేవా చేశారు. కష్టించి పండించిన ధాన్యాన్ని కొనకుండా అకాల వర్షాలపాలు చేసి ఆగం చేశారని ఆరోపించారు. ప్రతి రైతుకు డిసెంబర్ 9నే రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించి ఇప్పటికీ చేయలేదన్నారు. నేడు వరి పంటకు బోనస్ విషయంలో కూడా ప్రభుత్వ బోగస్ విధానాన్ని బయటపెట్టారన్నారు. ఓట్ల నాడు ఒకమాట నాట్ల నాడు మరోమాట చెప్పడమే కాంగ్రెస్ నైజమన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గాలి మాటలతో గారడీ చేసిందని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు డబ్బాలో పడగానే నాలుగు కోట్ల ప్రజల సాక్షిగా తన నిజస్వరూపాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం బయట పెట్టిందన్నారు. ఎద్దేడ్చిన యవుసం. రైతేడ్చిన రాజ్యం నిలబడదన్నారు. నమ్మి ఓటేసినందుకు.. రైతుల గొంతు కోసిన కాంగ్రెస్ సర్కారును అన్నదాతలు ఇక వదిలిపెట్టరన్నారు. నేటి నుంచి రైతన్నల చేతిలోనే కాంగ్రెస్ సర్కారుకు కౌంట్ డౌన్ షురూ అయిందన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్నను గెలిపించాలి

- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నాగపురి కిరణ్ కుమార్



నవతెలంగాణ-మద్దూరు

వరంగల్, ఖమ్మం నల్గొండ పట్టభద్రుల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను భారీ మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నాగపురి కిరణ్ కుమార్ కోరారు . ఈ సందర్భంగా దూల్మిట్ట మండలంలోని కూటికల్ గ్రామంలో తీన్మార్ మల్లన్న పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజాగొంతుక, నిరంతరం ప్రజలు కోసం తపించే వ్యక్తి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బండి కృష్ణ, గ్రామ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు కమలాకర్ గౌడ్, రెడ్యా నాయక్ తండా కాంగ్రెస్ అధ్యక్షుడు జితేందర్, రాజేష్ నల్ల, సుధాకర్ దాసారం, బాలరాజు పారుపల్లి, పొన్నం రాజు చేవెళ్ల తిరుపతి, నిమ్మ కంటి పాండు కూరెళ్ళ రాజు, నవీన్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఏక రూప వస్త్రముల పంపిణీ



నవతెలంగాణ-సిద్దిపేట

జిల్లాకు కేటాయించబడిన ఏకరూప వస్త్రములు మండలాలకు పంపిణీ చేసినట్లు అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రమేష్ తెలిపారు. మంగళవారం జిల్లా పాఠశాలల్లో నిర్వహించే అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను, పాఠశాలల్లో జరిగే అత్యవసర పనులను పర్యవేక్షించారు. ఏపీసీ చైర్మన్ లతో పాఠశాలల్లో జరిగే పనులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాసరెడ్డి, కో ఆర్డినేటర్‌లు రామస్వామి, రంగనాథ్, డి ఆర్ డి ఎ అధికారులు, హైండ్లూమ్ శాఖ అధికారులు, వివిధ గ్రామాల ఏ పి ఎం లు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు



నవతెలంగాణ-రాయపోల్

జనగామ జిల్లా పేరును సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జిల్లాగా మారుస్తామని ప్రకటన చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అహ్మదీ పూర్ నర్సాగౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం పరిపాలన సౌలభ్యం కోసం నూతన జిల్లాలు, మండలాలు ఏర్పాటు చేసినప్పుడు జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జిల్లాగా నామకరణం చేయాలని రాష్ట్రంలోని గౌడ సంఘాలు డిమాండ్ చేస్తూ ఉద్యమం చేపట్టినప్పటికీ పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రజా పాలనలో బహుజన రాజ్య స్థాపనలో ఎన్నో పోరాటాలు చేసి పరిపాలన చేపట్టిన బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ త్యాగాన్ని పోరాటాన్ని గుర్తించి జనగామ జిల్లాకు ఆయన పేరు కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయ పాపన్న గౌడ్ జిల్లాగా పేరు పెట్టాలని గౌడ సంఘాల నాయకులు చేసిన పోరాట ఫలితంగా గత ప్రభుత్వము సానుకూలంగా స్పందించినప్పటికీ, అదే బాటలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో హామీ ఇవ్వడం, ఇచ్చిన హామీని నెరవేర్చే విధంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఒప్పించడంలో ముఖ్యపాత్ర పోషించిన రాష్ట్ర రవాణా శాఖ, బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

బాధితురాలికి ఎల్ఓసి అందజేత

- బాధితురాలకు అండగా నిలిచిన గజ్వేల్
- మాజీ ఎమ్మెల్యే తుంకుంటా నర్సారెడ్డి



నవతెలంగాణ-జగదేవపూర్

జగదేవపూర్ మండల పరిసి లోని దౌలాపూర్ గ్రామానికి చెందిన ఆకారం లక్ష్మి గత ఇరవై రోజుల నుంచి కారియాడిక్ యస్‌యల్‌ఏ వ్యాధితో బాధపడుతున్నారు. కాగా ఆమెకు హాస్పిటల్ ఖర్చుల నిమిత్తం రూ.5 లక్షలు ఖర్చు అవుతాయని వైద్యులు తెలపగ విషయాన్ని దౌలాపూర్ గ్రామానికి చెందిన సిద్దిపేట కాంగ్రెస్ జిల్లా యువజన నాయకులు రాచమల్ల బంగారు రెడ్డి ప్రత్యేక చొరవతో కాంగ్రెస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు గజ్వేల్, మాజీ ఎమ్మెల్యే తుంకుంటా నర్సారెడ్డి సహకారంతో బాధితురాలు లక్ష్మికి రూ.2.50 లక్షల ఎల్ఓసి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అదేవిధంగా ప్రతి కార్యకర్తకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఇటిక్యాల సుధాక ర్‌రెడ్డి, రిపోర్టర్ జహంగీర్ మద్దికుంట నవీన్ రెడ్డి తిరుమలాపురం తిరుపతి, ఆకారం మల్లేష్, రమేష్ తదితరులు ఉన్నారు.

అనంత పద్మ నాభునికి ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-తొగుట

కేరళ రాష్ట్రంలో గల అనంత పద్మనామస్వామిని తెలంగాణ ఫిషర్మెన్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్‌తో పాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేపాక తిరుపతి ముదిరాజ్ మంగళవారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో నిమ్మ ప్రదీప్ కుమార్, నర్సింగ్ రావు, ప్రదీప్ గౌడ్, అరుణ్, లడ్డు తదితరులు పాల్గొన్నారు.

డంప్‌యార్డును పరిశీలించిన కమిషనర్



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని డం పియార్డును పరిశీలించి నట్లు కమిషనర్ గోల్కొం డ నరసయ్య తెలిపారు. మంగళవారం గజ్వేల్ పట్టణ సమీపంలో ఉన్న డంపింగ్ యార్డ్‌లో రీసైకిల్ విధానం పొడి వనరులను కాంపోస్ట్ ఎరువును పరిశీలించినట్లు తెలిపారు. డంపింగ్ యార్డ్‌లో నిర్వహిస్తున్న బయోమైనింగ్ విధానంలో రీసైకిలింగ్ చేసే పొడి వనరుల కంపోస్ట్ విధానం బాగుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఈ కిష్టన్న, శానిటరీ ఇన్స్పెక్టర్ శివకుమార్ తదితరులు ఉన్నారు.

రాజీవ్ గాంధీకి ఘన నివాళులు



నవతెలంగాణ-దుబ్బాక

దివంగత భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 33వ వర్ధంతి సందర్భంగా మంగళ వారం దుబ్బాక మండల పరిధిలోని సీఎస్ఆర్ క్యాంపు కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి మచ్చ శ్రీనివాస్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాల్వ నరేష్, కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ ఉషయ్యగారి రాజిరెడ్డి, దుబ్బాక మున్సిపాలిటీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కరాటే మాస్టర్ బూరాని శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు గోపి, మున్సిపల్ ఉపాధ్యక్షులు తొట్ల చంద్రం, సీనియర్ నాయకులు మట్ట కిషన్ రెడ్డి, దుబ్బాక మున్సిపాలిటీ, మండల సోషల్ మీడియా కో-ఆర్డినేటర్లు కర్ణంపల్లి రమేష్ గౌడ్, హర్ష రెడ్డి, ఐరేని సాయితేజ గౌడ్, తుమ్మ శంకర్, గుండెల్లి దుర్గయ్య, తదితరులున్నారు.

పటిష్టతలేని ప్రభుత్వ విద్య

- అందరూ నిష్ణాతులే...లోపమెక్కడా..?
- అధికశాతం విద్యార్థులు ప్రైవేటులోనే
- ప్రభుత్వ బడుల్లో సకల సౌకర్యాలున్నా నిత్యం సమస్యలే
- ప్రభుత్వోపాధ్యాయులు తమ పిల్లల్ని ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని పలువురి డిమాండ్



నవతెలంగాణ-బెజ్జంకి

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య లభిస్తుందని మాటలకే పరిమితమవుతున్నాయా? ప్రయివేటు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలను పరిశీలిస్తే నిజమేననే నమ్మకం కుదురుతోంది. ఎన్నో విధాలుగా నిధులు కేటాయిస్తూ. వినూత్న కార్యక్రమాలు చేపడుతూ ప్రభుత్వ విద్యను పటిష్టం చేయడానికి ప్రభుత్వం శాయశక్తుల కృషి చేస్తోంది. ప్రభుత్వ విద్యపై నేటికి ప్రజల్లో విశ్వాసం కల్పించడంలో అధికార యంత్రాంగం విఫలమవుతూనే ఉంది. ప్రభుత్వాధికారులు, ప్రభుత్వోపాధ్యాయుల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వ విద్య గాడి తప్పుతుందని ప్రజల్లో ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ పాఠశాల్లోనే పిల్లలను చేర్పించాలని సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు ఘంటాపథంగా చేసిన వాఖ్యలు సత్ఫలితాలివ్వడం లేదు. ఉన్నతమైన విద్యను అభ్యసించి నిష్ణాతులైన ఉపాధ్యాయులే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు విద్యా భోదన చేస్తారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు విద్యనభ్యసించేలా తల్లిదండ్రులు మొగ్గు చూపకపోవడంలో లోపమెక్కడ తలెత్తుతుందో అధికారులకు అంతుచిక్కడం లేదు. ప్రభుత్వ విద్య పటిష్టతమైనదైతే ప్రభుత్వోపాధ్యాయులు వారి పిల్లలను ప్రయివేట్ పాఠశాలల్లో చేర్పించాల్సినా దుస్థితితేందుకు నెలకొందని పలువురు ఆసహనం వ్యక్తం చేస్తున్నారు. మొట్టమొదట ప్రభుత్వోపాధ్యాయులు వారి పిల్లలను సామాన్యుల పిల్లలతో పాటు పాఠశాలల్లో చేర్పిస్తే ప్రభుత్వ విద్య పటిష్టమై విద్యార్థులందరికి సమానమైన విద్య అందించవచ్చునని. విద్యకు ప్రభుత్వాలు వెచ్చిస్తున్న నిధులు వృథావ్వకుండా పూర్తి స్థాయిలో వినియోగిస్తూ పాఠశాలల్లో తలెత్తున్న సమస్యల పరిష్కారానికి ఉపాధ్యాయులే ప్రధాన భూమిక పోషించవచ్చునని పలువురు సూచిస్తున్నారు. మండల పరిధిలోని అయా పాఠశాలల్లో బోధన సిబ్బంది, విద్యార్థులు నిత్యం ఎదో సమస్యతో సతమతమవుతున్నారనే ఆరోపణలు వెల్లవెత్తుతూనే ఉన్నాయి. మండలంలో విద్య శాఖ పరిస్థితి అంతమాత్రమేనని పూర్తి స్థాయిలో ఎంఈఓ లేకపోవడం వల్ల ప్రభుత్వ విద్య గాడితప్పుతుందనే విమర్శలు వినిపస్తున్నాయి. బోధనకు సరిపడ అవకాశాలు మేండుగా ఉన్న కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు అంతంత మాత్రమే ఉన్నారు. విద్యార్థులు అధికంగా ఉన్న పాఠశాలల్లో సౌకర్యాల్లేవు. సకల సౌకర్యాలున్న పాఠశాలల్లో ఆశించిన విద్యార్థులు లేరు అనే చందంగా మారింది ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి.

సకల సౌకర్యాలున్నా నిత్యం సమస్యలే

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు ప్రభుత్వం ఉచిత పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు, అల్పాహారం, మధ్యాహ్న బోజన సదపాయాలు కల్పిస్తున్న ప్రయివేట్ పాఠశాలలకు దీటుగా విద్యార్థుల ప్రవేశాలను మేరుగుపర్చడంలో అధికార యంత్రాంగం తలలు పట్టుకుంటోంది. మండల పరిదిలోని చీలాపూర్, దాచారం, గాగీల్లపూర్, తోటపల్లి ప్రభుత్వోన్నత పాఠశాలల్లో సకల సౌకర్యాలున్న నిత్యం సమస్యలే అన్నచందగా మారింది. తోటపల్లి, దాచారం ప్రభుత్వోన్నత పాఠశాలలో విశాలమైన తరగతి గదులు, నిష్ణాతులైన ఉపాధ్యాయులున్నా విద్యార్థుల్లేక వెలవెలబోతుంది. గాగీల్లాపూర్ ప్రభుత్వోన్నత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులున్న తరగతి గదుల్లేక చెట్లకింద విద్యా బోధన కొనసాగుతుంది. చీలాపూర్, వీరాపూర్ ప్రాథమిక పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరాయి. మన ఊరు-మన బడి కార్యక్రమం ద్వార మొట్టమొదట శిథిలావస్థలో ఉన్న పాఠశాలలాభివృద్ధికి నిధులు కేటాయించకుండా మేరుగ్గా సౌకర్యాలున్న పాఠశాలలకు నిధులు కేటాయించడంపై అయా గ్రామాల ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేసిన సందర్భాలున్నాయి.

అధికశాతం విద్యార్థులు ప్రయివేటులోనే

మండలంలో ప్రాథమిక (21), ప్రాథమికోన్నత(2), ఉన్నత(10), కేజీవీబీ, ఆదర్శ, గురుకుల(హుస్నాబాద్) పాఠశాలలు అధికారికంగా కొనసాగుతున్నాయి. 33 ప్రభుత్వ పాఠశాలల్లో గత విద్యా సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 2427 మంది విద్యార్థులు, 07 ప్రయివేట్ పాఠశాలలు ఉండగా సుమారు 2198 మంది విద్యార్థులు విద్యనభ్యసించారు. 33 ప్రభుత్వ పాఠశాలల్లో కంటే అధికంగా 07 ప్రయివేట్ పాఠశాల్లో విద్యార్థులు విద్యనభ్యసించడం ప్రభుత్వ విద్య పటిష్టతెంతాసడానికి దర్పణం పడుతోంది.

విద్యాబోధనలో 'ఆదర్శం'

మండలంలో ప్రభుత్వ విద్య పటిష్టతకు ఆదర్శ విద్యాలయం మారుపేరుగా నిలుస్తోంది. విద్యాబోదనతో పాటు క్రమశిక్షణ, క్రీడలు, పలితాల్లో అత్యుత్తమ ఉత్తీర్ణత సాధిస్తోంది. గత పది ఫలితాల్లో ఆదర్శ, కేజీవీబీ విద్యాలయ విద్యార్థులు మండలంలో ఉత్తమ ఉత్తీర్ణత సాధించారు. ఆదర్శ, కేజీవీబీ విద్యాలయ బోధన సిబ్బందిని స్పూర్తిని తీసుకుని మండలంలోని ప్రభుత్వ పాఠశాలల బోధన సిబ్బంది అడుగులు వేస్తే ప్రయివేట్ పాఠశాలలకు దీటుగా నిలుపవచ్చు.

ప్రభుత్వా దేశానుసారం పని చేయడం కర్తవ్యం

మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల అధ్వర్యంలో మరమ్మత్తులు పనుల విస్తృతంగా జరుగుతున్నాయి. పాఠశాల ప్రారంభం నాటికి విద్యార్థులకు యూనిఫారాలు అందించడానికి అవసరమైన చర్యలు తీవుకుంటున్నాం. పాఠ్యపుస్తకాలు అందుబాటులోకి రానున్నాయి. ప్రభుత్వాదేశానుసారం పని చేయడం ప్రధాన కర్తవ్యం. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలను పెంచడానికి కృషి చేస్తున్నాం.

వైభవంగా భూనీళా సమేత వరదరాజుల కల్యాణ మహోత్సవం

- తిలకించి పులకించిన గ్రామస్తులు





నవతెలంగాణ-మర్కుక్

మండల పరిధిలోని వరదరాజుపూర్ గ్రామంలోని పురాతన ఆలయం రెండో కంచిగా విరాధిల్లుతున్న వరదరాజుల స్వామి బ్రహ్మో త్సవాల సందర్భంగా మంగళవారం శ్రీశ్రీశ్రీ భూనీళా సమేత వరదరాజుల కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా కన్నుల పండుగగా నిర్వహించారు. ముక్కోటి దేవతల ఆశీస్సులతో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య భక్తుల నిరాజనాలతో ఆదిదంపతుల కళ్యాణ మహోత్సవ వేడుక అంబరాన్నింటింది. అంతకు ముందు ఆలయ ధర్మకర్త గోపాలకృష్ణ, గ్రామ తాజా మాజీ సర్పంచ్ ప్రవీణ్ కుమార్, మండల కో, ఆప్షన్ సభ్యులు లక్కాకుల సాహేరా నరేష్ దంపతుల ఆధ్వర్యంలో అశ్వవాహన పల్లకిపై ఏదుర్కోలు ఆలయం నుండి కళ్యాణ మండ పానికి భాజా భజంత్రీల చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలతో పాటు స్వామివారి పట్టు వస్త్రాలు తలంబ్రాల బియ్యం కట్న కానుకలు తీసుకొచ్చి శ్రీ శ్రీ శ్రీ భూనీళా సమేత వరదరాజస్వామి దంపతులకు సమర్పించారు. కళ్యాణ ఘట్టం అనంతరం కళ్యాణ మహోత్సవానికి హాజరైన వరదరాజస్వామి భక్తులకు హైద్రాబాద్ నివాసి క్షత్రి రాజేశ్వరి-సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్య క్రమం నిర్వహిం చారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. స్వామివారి వివాహ కళ్యాణానికి పూలపందిరి, టెంటు, భక్తులు స్వామి వారి కల్యాణాన్ని తిలకించడానికి ఎల్ఈడి స్క్రీన్‌ను ఉమ్మడి మెదక్ జిల్లా సహకార సంఘం డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి సమకూర్చారు. ఈ కార్యక్రమంలో మండల కో,ఆప్షన్ సభ్యులు లక్కాకుల సాహేర నరేష్, ఆలయ చైర్మన్ గోపాలకృష్ణ, గ్రామ తాజా మాజీ సర్పంచ్ ప్రవీణ్ కుమార్, ఆలయ పురోహితులు వర్ధాచారి, గోపాల చారి, పురుషోత్తమ చారి, గ్రామ పెద్దలు గ్రామస్తులు, ఆంజనేయస్వామిలు, వరదరాజుల స్వామి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ శ్రీ శ్రీ బూనీళా సమేత వరదరాజుల స్వామి తిరుకళ్యాణాన్ని తిలకించారు.

ఎన్ఎంఎంఎస్ స్కాలర్షిప్‌కు ఇర్కోడ్ మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపిక











నవతెలంగాణ- సిద్దిపేట రూరల్

నేషనల్ మీన్స్ కంమెరిట్ స్కాలర్షిప్‌కు ఇర్కోడ్ తెలంగాణ ఆదర్శ పాఠశాలకు చెందిన పది మంది విద్యార్థులు ఎంపిక అయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ బుచ్చిబాబు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థులు భరతేశ్వర్, మోహిత్, వెంకట్, యశ్వంత్, భవ్య శ్రీ, కృపాలిని, హర్షిత, ఉదయ, కిషోర్, వైష్ణవి, జస్వంత్ సాయి, సంతోషి విద్యార్థులు గత సంవత్సరం నవంబర్ నెలలో నిర్వహించిన పరీక్షకు విద్యార్థులు పాల్గొని పది మంది విద్యార్థులు అర్హత సాధించడం జరిగిందన్నారు. ఎంపికైన విద్యార్థులకు జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి ప్రశంసించారు. పాఠశాల ఉపాధ్యాయులకు విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

రైతులకు అందుబాటులో జనుము జీలుగ విత్తనాలు



నవతెలంగాణ-జగదేవపూర్

జగదేవపూర్ మండల కేంద్రంలో

మండలంలోని డీసీఎంఎస్ రైతు సేవా కేంద్రంలో పచ్చిరొట్ట ఎరువుల జీలుగ జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి వసంతరావు తెలిపారు. అవసరమైన రైతులు తమ పరిధిలోని రైతు వేదిక కార్యాలయంలోని వ్యవసాయ విస్తరణ అధికారుల వద్దకు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డ్ జిరాక్స్‌లతో వెళ్లి ఆన్లైన్లో కూపన్ తీసుకొని జగదేవపూర్‌లోని డీసీఎంఎస్ రైతు సేవా కేంద్రంలో డబ్బులు చెల్లించి విత్తనాలు పొందాలని తెలిపారు. విత్తనాలకు రూ.1116, 30 కిలోలు బస్తా, జనుములకు రూ.1448, 40 కిలోలు బస్తాకు చెల్లించాలని తెలిపారు. ఈ సబ్సిడీ విత్తనాలను రేపటి నుంచి రైతులకు పంపిణీ చేస్తామని తెలియజేశారు. అలాగే ఈ వానకాలానికి ముందస్తు ప్రణాళికగా పత్తి-17000 ఎకరాలు, వరి-12450 ఎకరాలు, మొక్క జొన్న-300 ఎకరాలు, కంది-100 ఎకరాలు మండ లం మొత్తంలో సాగు అవుతుందని అంచనా వేశామన్నారు. దీనికి సంబంధించిన పత్తి, వరి విత్తనాలు కూడా మార్కెట్లో సిద్ధంగా ఉన్నాయని, రైతులు ఒక్క హైబ్రిడ్‌పై ఆధారపడకుండా మార్కెట్లో ఉన్న అన్ని హైబ్రిడ్ పత్తి విత్తనాలను సాగు చేయాలని సూచించారు. అన్ని పత్తి విత్తనాలు సరైన యాజమాన్య పద్ధతులతో ఇంచుమించు ఒకేలా దిగుబడినిస్తాయన్నారు. కావున రైతులందరూ దీనిని గమనించి ఆందోళన పడే అవసరం లేదన్నారు. ఇప్పటివరకు మండలంలో 27000 పాకెట్ల పత్తి విత్తనాలు 450 క్వింటాళ్ల వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు.

విత్తనాల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు



నవతెలంగాణ-గజ్వేల్: గజ్వేల్ అగ్రికల్చర్ ఏడిఏ డివిజన్ పరిధిలోని గజ్వేల్, కొండపాక, రాయిపోల్ మండలాలో ఉన్న సీడ్స్, ఫర్టిలైజర్, పెస్టిసైడ్ డీలర్స్ సమావేశం గజ్వేల్ రైతు వేదికలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడిఏ బాబునాయక్ మాట్లాడుతూ వానాకాలం పంటలకు సంబంధించిన విత్తనాలు, ఫర్టిలైజర్ ప్రణాళికలు చేసి రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. కల్తీ విత్తనాలు అమ్మిన, డిమాండ్ ఉన్న విత్తనాలు కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు రైతులకు విక్రయించాలని ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకొంటామని డీలర్లను హెచ్చరించారు. తప్పనిసరిగా రైతులకు రశీదు ఇవ్వాలన్నారు. విధిగా స్టాక్ బోర్డు, ధరల బోర్డు రైతులకు కనబడే విధంగా ఉంచాలన్నారు. రైతులను మోసం చేయాలని ప్రయత్నిస్తే క్రిమినల్ కేసులు పెడతామని డీలర్లను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఏవో నాగరాజు, కొండపాక ఏవో ప్రియదర్శిని గజ్వేల్ మండల ఏఈఓ, డీలర్లు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థి విజయం ఖాయం

- గజ్వేల్ అసెంబ్లీ బీజేపీ కన్వీనర్ సురేష్



నవతెలంగాణ-గజ్వేల్: పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు విజయం ఖాయమని గజ్వేల్ అసెంబ్లీ బీజేపీ కన్వీనర్ సురేష్ సోమవారం తెలిపారు. మోడీ చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు కమలం గుర్తుకు ఓటు వేశారన్నారు. గత ప్రభుత్వం అనేక తప్పిదాలు చేసిందని బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి వెంకట్రామ్ రెడ్డిని ప్రజలు నమ్మరని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలకు వస్తున్న ఆరు గ్యారెంటీలు ఎక్కడ కూడా అమలు కాలేదన్నారు. ఒక బస్సు ప్రయాణం తప్ప మిగతా ఐదు గ్యారంటీలు అమలు ఎక్కడ చేశారో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. పరిపాలనపరంగా కేసీఆర్, రేవంత్ రెడ్డిలు ఇద్దరు ఒకటేనన్నారు. పార్లమెంటు బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావుకు గజ్వేల్ నియోజకవర్గంలో భారీ మెజార్టీ వస్తుందని ఆయన చెప్పారు. మోడీ చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించి ఓట్లు అడిగామని ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని దీని ద్వారానే రఘునందన్ రావు గెలుస్తారనే ధీమా ఉందన్నారు.